


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 55, పేజీలు - 08

మంగళవారం, జులై 29, 2025 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు

**- ఆపరేషన్ సిందూర్‌పై జైశంకర్ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని కేంద్ర మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' పై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని అన్నారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా ముక్తకంఠంతో నినదించిందని

2లో..

## భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

**- ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు**



స్కాట్లాండ్(ప్రశ్న న్యూస్) 'ఆపరేషన్ సిందూర్' నిలిచిపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు పాత పాట పాడారు! భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు తాను సరైన సమయంలో జోక్యం చేసుకున్నానని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోతే రెండు

2లో..

## హైదరాబాద్‌లో చిరుత సంచారం

**- సీసీ కెమెరాల్లో దృశ్యాలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**హైదరాబాద్‌లోని గోల్కొండ కోట ప్రాంతంలో చిరుతపులి సంచారం ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తోంది. ఇబ్రహీంబాగ్ మిలిటరీ ఏరియాలో ఒక చిరుతపులి రోడ్డు దాటుతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాలలో రికార్డు కావడంతో స్థానికులు భయంతో వణికిపోతున్నారు. ఈ సంఘటనను పలువురు స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం

2లో..





# బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ధర్నా

**- క్లారిటీ వచ్చాకే స్థానిక ఎన్నికలు - తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఒక ప్రముఖమైన పరిణామంగా కనిపిస్తోంది. దాదాపు 5 గంటలపాటు జరిగిన క్యాబినెట్ సమావేశంలో 25 అంశాలపై చర్చ జరిపారు. వీటిలో అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల రద్దుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా అన్ని రాష్ట్రాలకు చెక్ పోస్టులను తొలగించాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూచనలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా చెక్ పోస్టులను తొలగించాలని తాజాగా నిర్ణయం తీసుకుంది. వాహనాల మానిటరింగ్‌లో ఆధునిక సాంకేతికత వినియోగం.. మైక్రో బ్రూవరీస్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. వాహనాలను పరిశీలించేందుకు చెక్ పోస్టు దగ్గర సిబ్బందిని ఉంచడం కాకుండా, ఆధునిక వాహన్ సాఫ్ట్‌వేర్, అడ్వాన్స్‌డ్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగించనుంది. అంతేకాక కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్ లలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో మైక్రో బ్రూవరీస్ చట్టంలో అవసరమైన సవరణలు చేసి త్వరలో అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.

### కేంద్ర వైఖరిపై ఢిల్లీలో భారీ ధర్నా

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 5వ తేదీన మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడ వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అంతేకాకుండా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మద్దతును కూడా కోరనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటికే ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. మరోవైపు, రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు కూడా పూర్తైంది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణ

2లో..

## ప్రజలను రక్షించడం మా బాధ్యత

**- ఆపరేషన్ సింధూర్ భారత సైనిక శక్తికి ప్రతీక**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్ పై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేసింది. పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల సమయంలో చర్చ ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఆత్మరక్షణ కోసమే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. లోక్‌సభలో రాజ్‌నాథ్ ప్రసంగిస్తూ భారత సైనికులకు హ్యాట్యాఫ్. పహల్గామ్ ఉగ్రదాడి తరువాత సైనిక చర్య భారతదేశ సైనిక సామర్థ్యానికి, నిర్ణయాత్మక నాయకత్వానికి ప్రతీక అని అన్నారు. లోక్‌సభలో రక్షణ

2లో..

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జీలు

**- కేంద్రం ఆమోదం, రాష్ట్రపతి ఉత్తర్వులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. దేశంలోని పలు హైకోర్టులకు చెందిన 19 మంది న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తుల నియమకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు కొలీజియం పలువురు న్యాయవాదులు, జ్యుడీషియల్

2లో..

# ఏపీని అభివృద్ధి చేయండి

## సింగపూర్‌ని కోరిన సీఎం చంద్రబాబు

**- గత ప్రభుత్వ హయాంలో రికార్డులు సరిచేస్తా**

**- నవంబర్‌లో వైజాగ్ సదస్సుకు హాజరు కావాలి**

**- సింగపూర్ మంత్రిని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు**




సింగపూర్ / అమరావతి (ప్రశ్న న్యూస్) సింగపూర్ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. విశాఖ పెట్టుబడుల సదస్సుకు సింగపూర్ మంత్రికి ఆహ్వానించారు. ఏపీ ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వలో

2లో..

## గవర్నర్‌తో జగన్ భేటీ

**- లిక్కర్ స్కామ్ అరెస్టులపై ఫిర్యాదు.?**



అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ తో సమావేశమయ్యారు. ఆయన వెంట సతీమణి భారతి కూడా ఉన్నారు. బెంగళూరు నుంచి సోమవారం ఉదయం తాడేపల్లికి వచ్చిన జగన్ దంపతులు మధ్యాహ్నం గవర్నర్ తో సమావేశం అయ్యారు. ప్రధానంగా లిక్కర్ స్కాం లో జరుగుతున్న అరెస్టులపై గవర్నర్ కు ఫిర్యాదు చేసినట్లుగా వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఏపీ లిక్కర్ స్కామ్ పేరుతో భేతాళకథలు చెబుతూ లేని స్కాంలో ఆధారాలు సృష్టిస్తున్నారని వైసీపీ ఆరోపిస్తోంది. తమ వాదనకు బలం చేకూర్చేలా కొన్ని డాక్యుమెంట్లను కూడా గవర్నర్ కు జగన్ అందించినట్లుగా చెబుతున్నారు. లిక్కర్ స్కాంలో వైఎస్ భారతిని

2లో..

## తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

**- జూలై 31వ తేదీ నుంచి జిల్లాల్లో పర్యటన**

**- ఉమ్మడి జిల్లాల్లో పర్యటించేలా రూట్ మ్యాప్**

**- కాంగ్రెస్ నేతలంతా కలసి వస్తారా.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జులై 31 నుండి తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలతో సంబంధాలను బలపరచడం, ప్రభుత్వ విధానాలను ప్రచారం చేయడం కోసం అని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. వారం రోజుల షెడ్యూల్ ను ఖరారు చేశారు. రోజుకో నియోజకవర్గంలో ప్రతి నియోజకవర్గంలో 8 నుండి 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తారు. పూర్తి డీటైల్స్ ప్రకటించాల్సి ఉంది. మీనాక్షి నటరాజన్ ఫిబ్రవరిలో తెలంగాణ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు వరకూ దీపాదాస్ మున్షి ఉండేవారు.

2లో..

## ఎన్ని సార్లు ఉగ్రవాదాన్ని అంతం చేస్తారు.?

**- ఆపరేషన్ సిందూర్‌పై చర్చలు కాంగ్రెస్ ఎంపీ ప్రశ్న**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ నుండి ఉగ్రవాదులు పహల్గామ్‌కు ఎలా చేరుకుని 26 మందిని చంపారనే విషయాన్ని ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని లోక్ సభలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్ సభలో జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. 100 రోజులు గడిచినా ఈ ప్రభుత్వం ఉగ్రవాదులను

2లో..

## బెస్ట్ పాలసీలన్నీ సింగపూర్ నుంచే వస్తున్నాయి

**- బిజినెస్ ఫోరం సదస్సులో సీఎం చంద్రబాబు**




సింగపూర్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన రెండో రోజు ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ ప్రపంచంలో ఎలాంటి బెస్ట్ పాలసీలు వస్తున్నా,

2లో..

## కాశ్మీర్‌లో ఆపరేషన్ మహాదేవ్

**- పహల్గాం ఉగ్రదాడి మాస్టర్ మైండ్ హతం**



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీనగర్ నగర శివార్లలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దచిగామ్ నేషనల్ పార్కు సమీపంలోని హర్వాన్ ప్రాంతంలో ముఖ్యంగా ముల్నార్ ఏరియాలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య సోమవారం నుంచి హోరాహోరీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ ఆపరేషన్‌కు "ఆపరేషన్ మహాదేవ్" అని పేరు పెట్టారు. సమగ్ర నిఘా సమాచారం ఆధారంగా భద్రతా దళాలు యాంటీ-మిలిటెన్సీ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. నిర్దిష్ట ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి

2లో..

## సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధితులకు పరిహారం అందలేదు

**- నెల రోజులైనా కంపెనీ ప్రతినిధులపై చర్యలు ఎందుకు తీసుకోలేదు**

**- మరణించిన కార్మికుడు కొడుకు కంప్లెయింట్‌ను పట్టించుకోలేదు**

**- సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద తెలంగాణ ప్రభుత్వంపై హరీష్ రావు ఆగ్రహం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సిగాచి పరిశ్రమ యాజమాన్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమ్మక్కయ్యాడంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. జూన్ 30న సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై ఇప్పటి వరకు కంపెనీ ప్రతినిధులపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ ఆయన ప్రశ్నించారు. మరణించిన కార్మికుడి కొడుకు కంప్లెయింట్ ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఎవర్ని కాపాడే

2లో..

ప్రజాప్రశ్న



## మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ జరగలేదు

గుర్తు చేశారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణను కుదర్చడంలో ట్రంప్ ప్రమేయాన్ని ఆయన కొట్టి పారేశారు. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్, మురిద్కేలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తామని ఎవరైనా ఊహించారా అని ప్రశ్నించారు. పాక్ ఎదురుదాడులను సమర్థంగా ఎదుర్కొన్న తర్వాత దాడులు నిలిపివేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు అటు నుంచి ఫోన్లు వచ్చాయని తెలిపారు. కానీ డీజీఎంవో నుంచి విజ్ఞప్తి రావాలని తాము తేల్చి చెప్పామని అన్నారు.పహల్గామ్ ఉగ్రదాడికి కారణమైన టీఆర్ఎఫ్‌ను అమెరికా ఉగ్రవాద సంస్థగా ప్రకటించిందని గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి ఘటనను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, క్వాడ్, బ్రిక్స్‌తో పాటు వివిధ దేశాలు ఖండించాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితిలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయని వెల్లడించారు. పాకిస్థాన్, చైనాల పరస్పర సహకారం ఆరు దశాబ్దాలుగా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. చైనాతో వ్యవహరించాల్సిన తీరుపై ప్రతిపక్షాలు ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనడానికో, రహస్య ఒప్పందాలు చేసుకోవడానికో తాము చైనాకు వెళ్లలేదని ఎద్దేవా చేశారు. తాను చైనాకు వెళ్లింది తీవ్రవాదం మన పంథా వివరించేందుకు, వాణిజ్య ఒప్పందాల గురించేనని చెప్పారు.

## భారత్-పాకిస్థాన్ సహా ఆరు యుద్ధాలు ఆపేశాను

దేశాలు ఈపాటికి యుద్ధం చేస్తూ ఉండేవని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా తాను ఆరు యుద్ధాలను నివారించానని చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. “నేనే లేకుంటే ఆరు పెద్ద యుద్ధాలు జరుగుతుండేవి. ఇందులో భారత్–పాకిస్థాన్ అతి పెద్దది. ఎందుకంటే ఈ రెండు అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వస్త్రాలు ప్రయోగిస్తే యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి ఘోర పరిస్థితులు ఉండేవి. భారత్, పాక్ దేశాలకు చెందిన నేతలు నాకు బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని స్పష్టం చేశాను” అని పునరుద్ఘాటించారు. భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ ఇదివరకే పలుమార్లు వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో చిరుత సంచారం

అందించారు. ప్రస్తుతం ఈ చిరుతపులి కోసం ఫారెస్ట్ అధికారులు పోలీసులతో కలిసి విస్తృతంగా గాలిస్తున్నారు. స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు. ఇటీవలే నార్సింగి మున్సిపాలిటీలోని మంచిరేవుల విలేజ్ వ్యాస్‌నగర్ క్యాంపస్‌లో చిరుత సంచారం కలకలం రేపిన విషయం తెలిసిందే. అప్పుడు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరీ చిరుత జాడను కనిపెట్టారు. ఆ ఘటన మరువకముందే ఇప్పుడు గోల్కొండ వద్ద మరో చిరుత సంచరించడం ప్రజల ఆందోళనను మరింత పెంచింది.

## బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ధర్నా

ఎలా ఉండాలనే దానిపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

### రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని అన్ని పార్టీలలోని బీసీ నాయకులు అందరూ బీసీ రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఆగస్టు 5, 6, 7వ తేదీలలో ఢిల్లీలో నిరసన తెలుపుతామని, తమతో కలిసి రావాలని అన్ని పార్టీల బీసీ నాయకులను ఆహ్వానించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా రాష్ట్రంలో కుల గణన చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే, వాటికి అందాల్సిన నిధుల విడుదలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జీలు

సింగ్ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ “ఈ దేశ సరిహద్దులను కాపాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్న వీర సైనికులకు నమస్కరిస్తున్నాను. అదే సమయంలో భారతదేశ ఐక్యత, సమగ్రతను చాటి చెప్పేందుకు తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులకు నేను శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. దేశ ప్రజల తరపున సైనికులందరికీ కృతజ్ఞతలు. ఎవరైనా సైన్యం గురించి మాట్లాడితే ఆచితూచి, ఆలోచించి మాట్లాడాలని “ అన్నారు.

### అందుకే ఆపరేషన్ సిందూర్..

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ “భారత పౌరులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంటుంది. అందుకే మే 6, 7 తేదీలలో భారత సైన్యం ‘ఆపరేషన్ సింధూర్’ పేరుతో చారిత్రాత్మక సైనిక చర్యను చేపట్టింది. ఇది కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాదు. ఇది భారతదేశ సార్వభౌమత్వం, గుర్తింపు, దేశ పౌరుల పట్ల కేంద్ర ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ఉగ్రవాదంపై భారత విధానానికి ఒక ప్రభావవంతమైన ప్రదర్శన” అని పేర్కొన్నారు.

### సైన్యం లోతుగా అధ్యయనం చేసింది..

రాజ్‌నాథ్ మాట్లాడుతూ, ‘ఆపరేషన్ సిందూర్ నిర్వహించడానికి ముందు, భారత సైన్యం ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేసింది. మాకు చాలా చాయిస్‌లు అందుబాటులో ఉన్నాయి, కాని ఉగ్రవాదులు, వారి స్థావరాలకు ఎక్కువ నష్టం కలిగించాలని నిర్ణయం తీసుకున్నాం. వఅదే సమయంలో పాకిస్తాన్ పౌరులకు ఎటువంటి నష్టం జరగకుండా ఉండేలా ఉగ్రవాద శిబిరాలను ఎంపిక చేసి నాశనం చేశాం” అని అన్నారు.“భారత సైన్యం చేసిన ఈ ఖచ్చితమైన చర్యలో 9 ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సైనిక చర్యలో 100 మందికి పైగా ఉగ్రవాదులు, వారికి శిక్షణ ఇచ్చే వారు, ఉగ్ర స్థావరాల నిర్వాహకులు మరణించారు. వీరిలో ఎక్కువ మంది జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ప్రమాదకర ఉగ్రవాద సంస్థలకు చెందినవారు ఉన్నారు. మరోవైపు వీరికి పాకిస్తాన్ సైన్యంతో పాటు ఐఎస్ఐతో ప్రత్యక్ష సంబంధాలు, మద్దతు ఉన్నాయని” రాజ్‌నాథ్ అన్నారు.

### సుదర్శన చక్రం ఎంచుకోవాలని కృష్ణుడే చెప్పారు..

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, “ధర్మాన్ని కాపాడుకోవడానికి సుదర్శన చక్రాన్ని ఎంచుకోవాలని శ్రీకృష్ణుడి నుంచి మనం నేర్చుకున్నాము. 2006 పార్లమెంటు దాడి, 2008 ముంబై దాడులను భారత్ చూసింది. ఇప్పుడు ఇక చాలు అని చెప్పి సుదర్శన చక్రాన్ని సెలక్ట్ చేసుకున్నాం. మనతో సమానంగా ఉన్నవారిపై యుద్ధం చేయాలి. అయితే ప్రేమ, శత్రుత్వం ఒకే స్థాయిలో ఉండాలని గోస్వామి తులసీదాస్ చెప్పారు. అదే సింహం కప్పను చంపితే, అది మంచి సందేశాన్ని ఇవ్వదు. మన ఆర్మీ, సాయుధ దళాలు సింహాల్లాంటివారు” నేడు జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదుల ఏరివేత లక్ష్యంగా భారత ఆర్మీ ఆపరేషన్ మహదేవ్ చేపట్టింది. ఆర్మీ ఎన్ కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని ఓ ప్రకటనలో తెలిపారు.

## ఏపీని అభివృద్ధి చేయండి

జరిగిన తప్పిదాలు సరిదిద్ద చేయడానికి సింగపూర్ పర్యటనకు వచ్చానని వారికి చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైన రికార్డులను సైతం సరిచేస్తామన్నారు.

### ఏపీలోనూ వేగంగా పోర్టుల నిర్మాణం

సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వాములు కావాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి ఏపీ టీమ్ వివరించింది. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో అత్యుత్తమ విధానాలు అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని కోరారు.

### గతంలో జరిగిన పొరపాట్లు రిపీట్ కావు

మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమనిచంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో ప్రత్యేకంగా చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతోనే గతంలో హైదరాబాద్ లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని గతంలో చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరగనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు.గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తెలిపారు. ఈ రంగంలో సింగపూర్– ఏపీ కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎం చంద్రబాబుకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి సీఎం చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి చంద్రబాబుతో పాటు ఏపీ మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, నారాయణ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు జడ్జీలు

ఆఫీసర్లను న్యాయమూర్తులుగా, అదనపు న్యాయమూర్తులుగా నియమించాలని సిఫార్సు చేసింది. దీనికి రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రకటన విడుదల చేశారు. నియామకం పొందిన 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులుగా గౌస్ మీరా మొహియుద్దీన్, చలపతిరావు సుద్దాల, వాకిటి రామకృష్ణారెడ్డి, గడి ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. వీరితో పాటు మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు న్యాయమూర్తులు, నలుగురు అదనపు న్యాయమూర్తులు, గౌహతి హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు నియమితులయ్యారు.

## తెలంగాణలో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

మీనాక్షి నటరాజన్ ఎన్ఎస్‌యూఐ నుండి పార్టీలో ఎదిగారు. మధ్యప్రదేశ్ యూత్ కాంగ్రెస్‌లో కీలక నేతగా పని చేశారు. 2009లో మధ్యప్రదేశ్‌లోని మండ్సౌర్ నుండి ఎంపీగా గెలిచారు. రాహుల్ గాంధీకి అత్యంత ఇష్టమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వం ఉన్నటికీ కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకత్వం అంత చురుగ్గా లేదన్న అభిప్రాయంతో వారిని యాక్టివ్ చేసేందుకు మీనాక్షి నటరాజన్ ప్రయత్నిస్తున్నారు.స్థానిక ఎన్నికలు కూడా రానున్న సమయంలో ప్రజల సమస్యలను నేరుగా వినడం, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ, వెనుకబడిన తరగతుల కుల గణన వంటి పథకాలను ప్రచారం చేయడానికిపాదయాత్ర అవసరమని నిర్ణయానికి వచ్చారు. ఈ పాదయాత్రను అంతర్గత సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించుకునే అవకాశం ఉంది. పార్టీలోని సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం మెరుగుపరచడం , అసంతృప్త నాయకుల సమస్యలను పరిష్కరించడం వంటివి మీనాక్షి నటరాజన్ చేపట్టే అవకాశం ఉంది.కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన హామీలను అమలు చేసినప్పటికీ ఇంకా అనేక పథకాలు అమలు చేయాల్సి ఉందని అమలు చేసిన పథకాలు కూడా పూర్తిగా చేయలేదని విమర్శిస్తున్నారు. మొత్తం ఆరు వందల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తారని, కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికలకు సిద్ధంగా లేదని, ఆ పార్టీ క్యాడర్ అసంతృప్తితో ఉందన్న ప్రచారం కారణంగా మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగుతున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా నామినేటెడ్ పోస్టుల విషయంలో న్యాయం జరగలేదని భావిస్తున్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించినా చాలా మందికి పదవులు దక్కి ఉండేవి. కానీ అవి ఎప్పటికప్పుడు వాయిదా పడుతున్నాయి. అదే సమయంలో పార్టీలో గ్రూపు తగాదాలు పెరిగిపోతున్నాయి. అందర్నీ దారికి తెస్తే తప్ప స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్టు సాధించే అవకాశాలు ఉండవని అంచనాకు వస్తున్నారు. అందుకే దాదాపుగా ఆరు వందల కిలోమీటర్ల పాటు పాదయాత్ర చేసి ప్రధాన నియోజకవర్గాలన్నింటినీ కవర్ చేయాలనుకుంటున్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీనాక్షి నటరాజన్ తో పాటు పాదయాత్రలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

## సిగాచీ పరిశ్రమ ప్రమాద బాధితులకు పరిహారం అందలేదు

ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఇప్పటికీ అందరి కళ్లెదుటే ఉంది. ఈ విషాద ఘటనలో 46 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా మరో ఎనిమిది మంది ఆచూకీ దొరకలేదు. ఈ పెను విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారితో పాటు గాయపడిన వారికి నష్టపరిహారం అందిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఇప్పటివరకు కంపెనీ నుంచి గానీ, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదని ఆలస్యం చేస్తే కలెక్టరేట్ ముందు టెంట్ వేసి దీక్ష చేస్తామంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హెచ్చరించారు.సంగారెడ్డి కలెక్టరేట్‌కు సోమవారం వెళ్లిన హరీష్ రావు సిగాచి పరిశ్రమ బాధితుల తరఫున కలెక్టర్‌తో మాట్లాడారు. ఇప్పటి వరకు బాధితులకు ఆర్థిక సాయం అందలేదని చెప్పారు. పరిహారం వారానికి ఇస్తారా? లేక పది రోజులకా అనేది స్పష్టంగా చెప్పాలని లేకపోతే కలెక్టరేట్ ముందు టెంట్ వేసి దీక్ష చేస్తామంటూ హెచ్చరించారు. ప్రభుత్వంతో మాట్లాడి పేదలకు నష్టపరిహారం అందించాలని, అది జరగని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతమ చేస్తామన్నారు.గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇలాంటి సంఘటనే జరిగినప్పుడు మూడు రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం రూ. కోటి నష్ట పరిహారం బాధిత కుటుంబాలకు అందజేసిందని హరీష్ రావు కలెక్టర్‌కు గుర్తు చేశారు. కొంతమందికి రూ.10 లక్షలు కూడా అందజేయలేదని, గాయపడిన వారికి రూ.50 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉండాలంటూ కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నష్టపరిహారం అందించాలని సూచించారు. అంతకుముందు సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలను హరీష్ రావు పరామర్శించారు. తమ వాళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలవలేదంటూ బాధితులు గుండెలవిసేలా రోదించారు. బాధితులతో మాట్లాడిన హరీష్ రావు అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు. బాధితులు మీడియాతో మాట్లాడుతూ నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు తమ వాళ్ల ఆచూకీ లేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. కనీసం డెడ్ బాడీ లేకపోయినా మిస్సింగ్ అని లెటర్ ఇవ్వమంటే మునిసిపల్ అధికారులు ఇవ్వడం లేదంటూ వాపోయారు. తమని ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు.

## గవర్నర్‌తో జగన్ భేటీ

కూడా ఇరికించేందుకు సిట్ ప్రయత్నిస్తోందని జగన్ అనుమానిస్తున్నారు. ఇప్పటికే భారతి సిమెంట్స్ కు ఆడిటర్ గా ఉన్న బాలాజీ గోవిందప్పను అరెస్టు చేశారు. ఆయన వైఎస్ భారతికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకుంటారని చెబుతున్నారు. ఈ క్రమంలో గత వారం హైదరాబాద్ సిట్ పోలీసులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. భారతి సిమెంట్స్ హైదరాబాద్ కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించారు. బాలాజీ గోవిందప్ప చాంబర్ లోనూ సోదాలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది.మరో వైపు లిక్కర్ సొమ్ము పెద్ద ఎత్తున భారతి సిమెంట్స్ కంపెనీ ఖాతాల్లోకి మళ్లించారని సిట్ వర్గాలు అనుమానిస్తున్నాయి. నగదుకు సంబంధించిన సమావేశాలు, ఆ నగదును లాండరింగ్ చేయాల్సిన పద్దతుల గురించి భారతి సిమెంట్స్ కార్యాలయంలోనే చర్చించినట్లు సిట్ అధికారులు సాంకేతిక ఆధారాలు సేకరించినట్లుగా ప్రచారం జరుగుతోంది. అందుకే వైఎస్ భారతిని కూడా ఈ కేసులో ఇరికించేందుకు ప్లాన్ చేస్తున్నారన్న అనుమానంతో గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లుగా చెబుతున్నారు. లిక్కర్ స్కామ్‌తో పాటు ఏపీలో వరుసగా వైసీపీ నేతలపై కేసులు పెడుతూండటం, అరెస్టులు చేస్తూండటంతో పాటు తన పర్యటనకు వెళ్లినప్పుడు ఉద్రిక్తతలు సృష్టిస్తూడటంపైనా గవర్నర్ కు ఫిర్యాదు చేసినట్లుగా వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.గవర్నర్ స్పందన ఏమిటన్నదానిపై స్పష్టత లేదు. మామూలుగా ఏదైనా ప్రభుత్వానికి వ్యతిరేంగా ఫిర్యాదు చేయాలంటే పార్టీ నేతలందరితో కలిసి వెళ్తుంటారు. కానీ జగన్ ఈ సారి తన భార్య భారతిని మాత్రమే తీసుకుని వెళ్లి గవర్నర్ ను కలవడం ఆసక్తికరంగా మారింది. వైఎస్ జగన్ లిక్కర్ స్కామ్ విషయంలో ప్రభుత్వం వేధిస్తోందని భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. అసలు లిక్కర్ పాలసీతో సంబంధం లేని వారిని అరెస్టులు చేస్తున్నారని పలుమార్లు ప్రెస్ మీట్ లో చెప్పారు. అయితే గవర్నర్ కు చెప్పుకోవడం వల్ల వైఎస్ జగన్ కు ఏమీ ఉపయోగం ఉండదని ఆయన ఏమైనా డాక్యుమెంట్లు ఇచ్చి ఉంటే, వాటిని పరిశీలించాలని ప్రభుత్వానికే పంపుతారని అంటున్నారు. అయితే వైఎస్ జగన్మోహన్ రెడ్డి గవర్నర్ ద్వారా కేంద్రానికి ఏదైనా విజ్ఞప్తులు పంపాలని అనుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తంగా సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉన్న సమయంలో గవర్నర్ తో జగన్ దంపతులు సమావేశం కావడం ఆసక్తి రేపుతోంది.

## బెస్ట్ పాలసీలన్నీ సింగపూర్ నుంచే వస్తున్నాయి

అవి సింగపూర్ నుంచే వస్తున్నాయని అన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో తాము 30 ఏళ్లుగా పనిచేస్తున్నామని చెప్పారు. తాను 90వ దశకంలో మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు, హైదరాబాదు ఉప్పల్ లో సింగపూర్ టౌన్ షిప్ ఏర్పాటు చేయాలని కోరానని వెల్లడించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోనూ సింగపూర్ తరహాలో వరల్డ్ క్లాస్ సిటీ నిర్మించాలని దృఢ సంకల్పంతో ఉన్నామని అన్నారు. రాజధాని మాస్టర్ ప్లాన్ ఉచితంగా ఇచ్చేందుకు సింగపూర్ ముందుకువచ్చిందని తెలిపారు.

2014లో ఏపీ మాస్టర్ ప్లాన్ కోసం సింగపూర్ వచ్చానని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను చక్కదిద్దేందుకే ఇప్పుడు మళ్లీ వచ్చానని చంద్రబాబు స్పష్టం చేశారు. నవంబరు 14, 15 తేదీల్లో ఏపీలో సీఐఐతో కలిసి సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు సింగపూర్ ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. భారత్ కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాయకులు మిక్స్ డ్, సోషలిస్ట్ ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించారని వెల్లడించారు. దాంతో భారత్ చాలాకాలం పాటు వెనుకబాటుతనంతో బాధపడిందని, అలాకాకుండా 1947 నుంచే ఆర్థిక విధానాల్లో పోటీపడి ఉంటే భారత్ ఈపాటికి ఉన్నత స్థానంలో ఉండేదని అన్నారు. చివరికి 1991 వచ్చాక గానీ భారత్ ఆర్థిక సంస్కరణ పట్టలేదని తెలిపారు. భారత్ లో ఆర్థిక సంస్కరణలు వచ్చిన 13 ఏళ్లకు చైనా కూడా సంస్కరణలు తీసుకువచ్చిందని చంద్రబాబు గుర్తుచేశారు.

## కాశ్మీర్‌లో ఆపరేషన్ మహాదేవ్

ఉన్నారన్న పక్కా సమాచారంతో జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సైన్యం సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరపడంతో ఎదురు కాల్పులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సుమారు ఇద్దరు నుంచి ముగ్గురు ఉగ్రవాదులు చిక్కుకున్నట్లు భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. అంతేకాకుండా వీరు పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరులుగా భావిస్తున్నారు. పహల్గామ్ దాడిలో పాల్గొన్న లష్కరే తొయిబా ఉగ్రవాది సులేమాన్ షాను మట్టుబెట్టినట్టు సైనిక వర్గాలు తెలిపాయి.

### ఆపరేషన్ ‘మహాదేవ్’.. ఉగ్రవాదులు మట్టిగలిసినట్టేనా.?

ఎదురుకాల్పుల ధ్వనులు ఎప్పటికప్పుడు వినిపిస్తున్నాయని, ఇది ఒక తీవ్రమైన ఆపరేషన్ అని అధికారులు తెలిపారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సంఘటనా స్థలానికి అదనపు బలగాలను పంపారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి లేదా మట్టుబెట్టడానికి బలగాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశాయి. శ్రీనగర్‌లో ఉన్న ఆర్మీకి చెందిన చినార్ కార్ప్స్ తమ అధికారిక ‘ఎక్స్’ (గతంలో ట్విట్టర్) హ్యాండిల్ ద్వారా ఈ ఎన్‌కౌంటర్ గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తోంది. మొత్తం ఆపరేషన్ పూర్తయిన తర్వాతే ఉగ్రవాదులను చంపారా లేదా అనేది తెలిసే అవకాశం ఉంది.

## ఎన్ని సార్లు ఉగ్రవాదాన్ని అంతం చేస్తారు.?

పట్టుకోలేదన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న గౌరవ్ గోగోయ్ ఏకధాటిగా ప్రసంగించారు. పహల్గాంలో భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపారు, డ్రోన్‌లు, పెగాసస్, శాటిలైట్‌లు, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ వంటి అధునాతన సాంకేతికత, భద్రతా దళాలు ఉన్నప్పటికీ, ఉగ్రవాదులను పట్టుకోలేకపోవడం ఏమిటని గౌరవ్ ప్రశ్నించారు. “దాడి జరిగిన తర్వాత కాల్పుల ప్రాంతానికి ఓ అంబులెన్స్ చేరుకోవడానికి గంట పట్టిందన్నారు. సైన్యం కూడా కాలి నడకన వచ్చిందని” ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో 100 మంది ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని నిర్వహించిన 22–నిమిషాల సైనిక దాడ ఫలితాలను ప్రశ్నించారు. రాజ్‌నాథ్ సింగ్ పుల్వామా దాడుల తర్వాత ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని చెప్పారు. ఇప్పుడు మళ్లీ అదే చెబుతున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనట్లయితే, ఇంకా ఉగ్రవాదం ఎందుకు కొనసాగుతోందని గౌరవ్ ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత ఫైటర్ జెట్‌ల నష్టం గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐదు లేదా ఆరు జెట్‌లు కూలిపోయినట్లు పేర్కొన్నారని. “మన ఫైటర్ జెట్‌లలో ఎన్ని కూలిపోయాయి? ఇది దేశ ప్రజలకే కాదు, మన జవాన్లకు కూడా తెలియాలి” అని స్పష్టం చేశారు.భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి గగోయ్ పలు సందేహాలు వ్యక్తం చేశారు. తానే యుద్ధాన్ని ఆపానని ట్రంప్ 26 సార్లు చెప్పాడని భారత్, పాకిస్తాన్‌లను వాణిజ్య ఒప్పందాల ఒత్తిడితో కాల్పుల విరమణకు ఒప్పించినట్లు చెప్పుకుంటున్నాడన్నారు. మొత్తం దేశం, విపక్షాలు ప్రధానమంత్రి మోదీకి మద్దతు ఇస్తున్నాయి. అకస్మాత్తుగా మే 10న కాల్పుల విరమణ జరిగింది. ఎందుకు? పాకిస్తాన్ మోకాళ్లపైకి వచ్చిందంటే, మీరు ఎందుకు ఆపారు? ఎవరి ముందు లొంగారు?” అని గోగోయ్ ప్రశ్నించారు. ఈ కాల్పుల విరమణ వెనుక చైనా పాత్ర కూడా ఉందని గగోయ్ అనుమానం వ్యక్తం చేశారు. పహల్గామ్ ఘటన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సౌదీ అరేబియా నుండి తిరిగి వచ్చిన తర్వాత పహల్గామ్‌ను సందర్శించకుండా బీహార్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారని విమర్శఇంచారు. పహల్గామ్‌కు ఎవరైనా వెళ్లారు అంటే అది మా నాయకుడు రాహుల్ గాంధీ మాత్రమేనన్నారు. బాధితుల కోసం మార్టిర్ స్టేటస్ డిమాండ్ చేసింది కూడా రాహుల్ గాంధీ” అని ఆయన గుర్తు చేశారు.

## నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం



జూలై 29న ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏట అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. పులుల సంరక్షణపై అవగాహన కలిగించడానికి ఈ దినోత్సవం జరుపబడుతుంది.2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించబడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందుకోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం.2017: ఏడవ అంతర్జాతీయ పులుల దినోత్సవం నాడు ప్రపంచవ్యాప్తంగా భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలతోపాటు పులులు లేని దేశాలైన ఇంగ్లాండ్, యునైటెడ్ స్టేట్స్ లో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అనేకమమంది వారివారి సోషల్ మీడియా ప్రొఫైల్ ఫోటోలను తొలగించడం ద్వారా అంతర్జాతీయ పులుల దినోత్సవంకు తమ మద్దతును ప్రకటింస్తారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రేంజర్ల ద్వారా “డబుల్ టైగర్స్” ప్రచారం జరిగింది. దీని గురించి అవగాహన పెంచడానికి అనేక కంపెనీలు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తో భాగస్వామ్యం అయ్యాయి.భారతదేశంలో ప్రతి నాలుగు సంవత్సరాలకు అడవి పులుల సంఖ్యను లెక్కిస్తారు. పులుల సంఖ్య 2006లో 1411, 2010లో 1,726 ఉండగా 2014లో 2226కి పెరిగింది. 2018 నాటికి 2,967 పులులు ఉన్నట్లు అంచనా వేశారు.

## నెల్లిమర్లలో మంత్రులు గొట్టిపాటి, కొండపల్లి పర్యటన

**విజయనగరం** నెలిమర్ల నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్ పర్యటించారు. డెంకాడ మం. పెద్దతాడివాడలో 33/11 కేవీ సబ్ స్టేషన్ కు మంత్రులు శంఖుస్థాపన చేసారు. రూ. 2.8 కోట్లతో నిర్మించనున్న సబ్ స్టేషన్ కు శంఖుస్థాపన చేసారు. మంత్రి గొట్టిపాతి మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యలకు చెక్కు పెట్టేందుకే సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నాం. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు కేంద్రం కేటాయించింది. తీర ప్రాంతాల విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. గత ఐదేళ్లలో విద్యుత్ శాఖ దోపిడీకి గురైంది తప్ప అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.విద్యుత్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం . రూపాయి బిల్లు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం . రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయరాదని అన్నారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు

**ములుగు** మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కన్నాయిగూడెం మండలంలో ఎస్సై ఈ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్గఢ్ నుంచి కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?’

### రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై మండిపడ్డ భారత్

**న్యూ ఢిల్లీ** ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. ‘మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?’ అంటూ ప్రశ్నించారు.

# నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ

## - నేడు మన తెలంగాణ ముద్దు బిడ్డ, జ్ఞాన పీఠా అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి



తెలుగు చలన చిత్ర సీమలో డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం సహజత్వానికి ప్రయోగాలకు పుట్టినిల్లు. అంతకు మునుపు ఎక్కువగా వాడని పదాలను సాహితీ ప్రవంతిలోకి తీసుకు వచ్చి, వాటితో సాహిత్యానికి ఎంతో వన్నె తెచ్చారు సినారె. దొరసాని, నెరజాణ వంటి పదాలు అప్పట్లో తెలుగు సినీ సాహిత్యంలో చాలా అరుదుగా ఉపయోగించే వారు. నారాయణ రెడ్డి అటువంటి పదాలను తన సాహిత్యంలో పొందు పరచి తెలుగు భాష అందాన్ని పెంచారు. సినారెగా సుప్రసిద్ధుడైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిది ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని హనుమాజీపేట. బుచ్చమ్మ, మల్లారెడ్డి తల్లిదండ్రులు. 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంతో పాటు సిరిసిల్ల,కరీంనగర్‌లో పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసానికి హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నపుడే శోభ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. పసి వయసులో విన్న హరికథలు, జానపదాలు, జంగం కథల స్ఫూర్తితో ఉన్నత స్థాయి సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. 1953లో నవ్వనిపువ్వుతో ప్రారంభమైన సినారె సాహిత్య ప్రస్థానం అలుపెరగక సాగిపోయింది. పద్య కవితలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, సంగీత నృత్య రూపకాలు, ముక్తకాలు, బుర్ర కథలు, గజల్లు, వ్యాసాలు విమర్శలు, అనువాదాలు వంటి అనేక సాహితీ ప్రక్రికయల్లో అనితర సాధ్యమైన ప్రతిభను చాటుకున్నారు.నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర, మంటలు మానవుడు, మధ్య తరగతి మందహాసం, నడక నా తల్లి, తెలుగు గజల్లు, భూమిక, ముఖాముఖి, ఆరోహణ, అక్షర గవాక్షాలు, ఇంటి పేరు చైతన్యం తదితర రచనలు చేశారు. సినారె రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దీంతో పాటు ఆయన గ్రంథాలు ఇంగ్లిష్, ఫ్రెంచ్ సంస్కృతం, మలయాళం, హిందీ, ఉర్దూ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో సందర్శించారు. అంతర్జాతీయ కవి సమ్మేళనాల్లో భారతీయ ప్రతినిధిగా హాజరై తెలుగు సాహిత్య వైభవాన్ని విశ్వయవనికపై చాటారు. ఆధునిక ఆంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు పేరిట సినారె పరిశోధన ఆయను పీహెచ్‌డీ ప్రామాణిక విమర్శన గ్రంథంగా మిగిలింది.అత్యున్నత పురస్కారాలు..కేంద్ర సాహిత్య అకాడమి, సోవియట్ ల్యాండ్ నెహ్రూ పురస్కారంతో పాటు విశ్వంభర దీర్ఘ కావ్యానికి 1988లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారం వరించింది.భారతీయ భాషా పరిషత్, రాజలక్ష్మి, అసాన్, ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాలు సలహాదారునిగా, సాంస్కృతిక మండలి, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వ్యవహరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం సినారె సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలిచ్చింది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. సినిమా పాటలు కైకట్టి..వందలాది సినిమాలకు వేల సంఖ్యలో సినీ గీతాలు రాశారు. స్వర్గీయ ఎన్టీఆర్ కథానాయకుడిగా విడుదలైన గులేబకావళి కథ సినిమాలో నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సినారె ఆపైన సుమారు మూడు వేలకు పైగా పాటలు రచించి సినిమా ప్రేక్షకులకు సైతం చేరువయ్యారు. చిలిపి కనుల తీయని చెలికాడా..అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాణి, నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు, జాతిని నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు. అమ్మను మించి దైవం ఉన్నదా ఆత్మను మించి అద్దమున్నదా.. కంటేనే అమ్మ అని అంటే ఎలా.. ఓ ముత్యాల కొమ్మా...ఓ రాములమ్మా.. తదితర తెలుగు సినిమా పాటలు సినారె ప్రతిభకు తార్కాణాలు. సినిమా పాటల్లో సైతం సాహిత్య విలువలకు పట్టం కట్టి తెలుగు సినీ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. 2017 జూన్ 12 న హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్ను మూశారు.

### యాదగిరిగుట్ట దేవస్థానంలో

# ప్రక్షాళనకు పది కమిటీలు

## - నిర్వహణ లోపాల నివారణే కమిటీల ధ్యేయం



**యాదగిరిగుట్ట :** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పాలన కొత్త పుంతలు తొక్కుతోంది. పాలనలో పారదర్శకత లోపాల నివారణ కోసం ప్రక్షాళనకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ వెంకట్రావు ప్రక్షాళన చర్యలు చేపట్టారు. భక్తులకు మెరుగైనతీ సౌకర్యాలు దర్శనాలు కల్పించేందుకు పది కమిటీలను నియమించారు. పాలనాపరంగా నిర్వహణలో అన్ని విభాగాలలో పారదర్శకత పాటించేందుకు లోపాలను నివారించేందుకు అంతర్గతంగా ఆడిటు చేసుకునేందుకు అదేవిధంగా భక్తులు స్థానికుల నుండి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసేందుకు కమిటీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు దేవస్థానంలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన లోపాలను సూచనలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి దృష్టికి తీసుకువచ్చే విధంగా ఈ కమిటీలు పరిచారని నిర్ణయించారు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఈ పది కమిటీలకు చైర్మన్గా వ్యవహరిస్తారు దేవస్థానం అధికారులు సిబ్బందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీలను ఏర్పాటు చేశారు

### పది కమిటీలు ఇవే....

1) దేవాలయం, ప్రసాదాలు, అన్నదానం పర్యవేక్షణ కమిటీ .2) క్రౌడ్ మేనేజ్మెంట్ కమిటీ. 3) సేఫ్టీ అండ్ సెక్యూరిటీ ఓవర్ సైట్ కమిటీ. 4) పారిశుద్ధ్యం, పరిశుభ్రత పర్యవేక్షణ కమిటీ. 5) విద్యుత్ ,సీసీ కెమెరాలు, వైర్లెస్ వ్యవస్థ, బ్యాటరీ వాహనాలు, ఏసీలు, లిఫ్టుల పర్యవేక్షణ కమిటీ. 6) వసతి సౌకర్యాల పర్యవేక్షణ కమిటీ .7) విద్యాసంస్థల పర్యవేక్షణ కమిటీ. 8) రెవెన్యూ యాజమాన్య కమిటీ .9) లీజులు, కిరాయి యాజమాన్య కమిటీ.10) అకౌంట్స్ మేనేజ్మెంట్ కమిటీ.



# మీకు ఇచ్చేది పదవులు కాదు బాధ్యత

- గతంలో వక్ఫ్ బోర్డ్ ద్వారా ముస్లిం లకు ఎటువంటి సంక్షేమం జరగలేదు
- రాబోవు విద్యా సంవత్సరంలో 500 మందికి ఉచిత విద్య అందించబోతున్నాం.
- ఇందులో ప్రతి వక్ఫ్ బోర్డ్ సంస్థ భాగస్వామ్యం కావాలి
- మీ సొంత పిల్లలను చదివించిన భావనతో బాధ్యత తీసుకోండి
- దేవుడి ఆస్తులను చౌకగా కోరుకోకండి, ప్రీమియంగా తీసుకోండి
- ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఐఏఎస్, ఐపిఎస్ కోచింగ్ అందిస్తాం
- నాతో కలిసి నడవండి ముస్లిం సమాజాన్ని ఉన్నతంగా నిలుపుదాం
- షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్



**నెల్లూరు (ప్రశ్న న్యూస్)** విజయవాడలోని కాళేశ్వర రావు మార్కెట్ వద్ద గల ఇందాద్ ఘర్ కాంప్లెక్స్ లోని వక్ఫ్ బోర్డు కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 5 వ వక్ఫ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. బోర్డు సమావేశ అనంతరం గత బోర్డు సమావేశంలో నియమించిన పలు ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీల వారితో ఆయన సమావేశం నిర్వహించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మీకు ఇచ్చేది పదవులు కాదని బాధ్యతని ఇస్తున్నామని అన్నారు. గతంలో వక్ఫ్ బోర్డు ద్వారా ముస్లిం సమాజానికి ఎటువంటి సంక్షేమం జరగలేదని అన్నారు. గతంలో ఎంతో మంది దాతలు వేల ఎకరాలు దానం చేసి వెళ్లారు. దాదాపు 70 వేల ఎకరాల భూమిలో 30 వేల ఎకరాలు ఆక్రమణకు గురై మన చేతుల్లో లేకుండా పోయింది. మిగిలిన భూముల్లో దాదాపు 15 వేల ఎకరాలు ప్రభుత్వం అక్వైర్ చేసుకుందని అన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం నూతన ఉచిత విద్యా పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. రాబోవు విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతమైన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ ఉన్నత ఇంటర్మీడియట్ విద్య ను అందించబోతున్నామని తెలిపారు. ప్రతి వక్ఫ్ బోర్డ్ సంస్థ ఆదాయానికి అనుగుణంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలని అన్నారు. మీ మీ సంస్థలలో ఆదాయాన్ని పెంచి విద్యార్థుల చదువుకు ఉపయోగపడాలని అన్నారు. మీ సొంత పిల్లలను చదివించిన భావనతో వారి బాధ్యత తీసుకోండి. దేవుడి ఆస్తులను చౌకగా కోరుకోకూడదని, ప్రీమియం గా తీసుకోవాలని అన్నారు. ఒక విద్యార్థిని సమాజం ఉన్నత చదువు చదివించాలని సమాజానికి తిరిగి మేలు చేస్తాడని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యతోపాటు ఉచిత ఐఏఎస్ కోచింగ్ ను అందిస్తామని తెలిపారు.

త్వరలో రాష్ట్రంలోని పలుచోట్ల స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు నేర్పించి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు. అందరూ నాతో కలిసి నడవండి ముస్లిం సమాజాన్ని ఉన్నతమైన స్థానంలో నిలబెడతా. సమావేశంలో బోర్డ్ సభ్యులైన శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్, ఖాజా, అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్ అహమద్ సీఈఓ మొహమ్మద్ అలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

# గోశాలలో మృత్యుఘోష

-అనారోగ్యంతో తరచూ గోవుల మృత్యువాత

- అరకొర షెడ్లతో ఎండకు ఎండుతూ....వర్షాలకు తడుస్తోన్న గోవులు

-షెడ్డు నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నా సహకారం అందించని యాజమాన్యం.



**యర్రబాలెం:** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం శ్రీ కృష్ణానంద ఆశ్రమం ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా నిర్వహిస్తోన్న గోశాల మృత్యుఘోష కు నిలయంగా మారింది. ఇటీవల గోశాలలోని పలు ఆవులు మృత్యువాత పడ్డాయి. తాజాగా ఓ ఆవుదూడ మృతి చెంది రెండు రోజులు గడిచినా సిబ్బంది చూసీచూడనట్లు గా వ్యవహరించారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.గోశాలలో సరైన వసతి సౌకర్యాలు లేక గోవుల ప్రాణాలకు రక్షణ కరువైపోతోంది. నిలువ నీడ లేక ఆవులు ఎండకు ఎండి పోయి వానకు తడిచిపోతున్నాయి. ప్రధానంగా గోశాల ప్రాంగణంలో ఇటీవల కురిసిన వర్షాలకు చిత్తడి చిత్తడిగా తయారైంది. గోమూత్రం,పేడతో గోశాల అపరిశుభ్రతకు కేరాఫ్ గా మారింది. గోవులు పడుతున్న ఇబ్బందులను గమనించిన కొందరు దాతలు గోశాలలో షెడ్లు నిర్మించేందుకు ముందుకు వస్తున్నా.... తమ పెత్తనానికి ఎక్కడ గండి పడుతోందోననే దురాలోచనతో షెడ్ల నిర్మాణాన్ని అంగీకరించడం లేదు. ఫలితంగా గోవులు వర్షాలకు తడుస్తూ... ఎండకు ఎండుతున్నాయి. ఇక గోవులకు మేత కూడా అంతంత మాత్రంగా ఉండటంతో బక్కచిక్కి పోతున్నాయి. ఏది ఏమైనా నోరులేని గోవుల సంరక్షణకు గోశాల నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# ఎన్నికల్లో "సత్తా"చాటుతాం

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య

- కాంగ్రెస్, బీజేపిలు కుమ్ముక్కయ్యాయని విమర్శలు




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతామని జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య అన్నారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దాటవేత విధానాల వల్ల ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా ఏంటో చూపిస్తామని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపి పార్టీలు కుమ్ముక్కై సీమాంధ్ర నాయకులు సీఎం రమేష్ తో తప్పుడు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుయుక్తులను ప్రజలు ఎండగడతారని అన్నారు. సీమంధ్ర కుట్రలు తెలంగాణలో చెల్లబోవని స్పష్టం చేశారు. సమావేశంలో గుండారపు కృష్ణారెడ్డి, గజబింకార్ రాజన్న, సుంకపాక మనోజ్, దార్ల సందీప్, సత్యనారాయణ, కంచర్ల రవి గౌడ్ వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆది పరామర్శ.. ! ప్రగాఢ సానుభూతి...!!



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెదిరే రాజేశం తండ్రి అనారోగ్యంతో సోమవారం మరణించడంతో, వారి కుటుంబాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సోమవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ తుమ్ మధు, మాజీ సర్పంచ్ సాయిని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దారం వెంకటేష్ గుప్తా ఎన్నిక



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా దారం వెంకటేష్ గుప్తా ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దారం వెంకట్ గుప్తా మాట్లాడుతూ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు సంఘం ప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొనగిరి శ్రీనివాస్ గుప్త, సంభు పాండయ్య గుప్తా,జైని నాగయ్య గుప్తా ,జిల్లా రవీందర్ గుప్తా, పల్లేర్ల బిక్షపతి గుప్తా, కొత్తపల్లి రమేష్ గుప్తా, ప్రకాష్ గుప్తా, కోర్తి వాడ రామచంద్ర ము గుప్తా కోర్తివాడ శ్రీనివాసులు గుప్తా, జిల్లా హరిబాబు గుప్తా,బోనగిరి శ్రవణ్, గుప్తా, రాచూరి జంగయ్య గుప్తా, మరియు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కూన బెదిరింపులకు యువకుడి ఆత్మహత్య

- సమ్మక సారక్క రెడీమిక్స్ సంస్థకు సంబంధించిన లావాదేవీల్లో కోటి రూపాయలు అవకతవకలు చేశాడని నింద
- ఇంటికి వెళ్లి కారు, సెల్ ఫోన్ లాక్కొని బెదిరించిన యజమానులు
- మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ సోదరుడు శ్రీనివాస్ గౌడ్ కారణం అంటూ మృతుని కుటుంబ సభ్యుల ఆరోపణలు





కుత్బుల్లాపూర్ (ప్రశ్న న్యూస్) మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడు శ్రీనివాస్ గౌడ్ వేధింపులు తాళలేక కూకట్ పల్లి, వెంకట్ రావు నగర్ ప్రాంతానికి చెందిన కుమార్ యాదవ్ అనే వ్యక్తి సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య పాలుపడడంతో మృతి చెందాడు. కుమార్ యాదవ్ గత ఎనిమిది ఏళ్లుగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడుకు చెందిన సమ్మక్క సరక్క అనే రెడీ మిక్స్ సంస్థలో అకౌంటెంటుగా వృత్తి నిర్వర్తిస్తున్నాడు. సంస్థ యొక్క వ్యవహారాలన్ని సోదరుడు మాజీ ఎంపిపి శ్రీనివాస్ గౌడ్ చూస్తుంటారు. ఈమధ్యకాలంలో సంస్థలో ఒక కోటి రూపాయల లావాదేవీల్లో అవకతవక జరిగిందని, దినివేనుక కుమార్ యాదవ్ ఉన్నట్టు అనుమానాలు పెంచుకున్నారు. విచారణ పేరుతో కుమార్ ను సంస్థ ఆఫీసుకు పిలిపించి వేధింపులకు గురిచేసారని, అతని సెల్ ఫోన్, కార్ లాక్కొని మొబైల్ లోని పర్సనల్ డేటాలు మొత్తం చెక్ చేసుకొని, రెడీ మిక్స్ కంపెనీలో పని చేస్తున్న డ్రైవర్లతో కొట్టించారని, ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తమతో తెలిప్యాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా ఆరోపించారు. కోటి రూపాయల వ్యవహారినికి తనకు ఎలాంటి సంబంధం లేదన్న కూన శ్రీనివాస్ గౌడ్ నమ్మడంలేదని, మనస్థాపానికి గురై కుమార్ యాదవ్ ఆత్మహత్య చేసుకున్నాడని వారి బంధువులు తెలిపారు. కుమార్ భార్య ఫిర్యాదుతో కూకట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో కల్వర్టు నిర్మాణానికి రూ.12 లక్షలు నిధులు మంజూరు

- ప్రజల హర్షం..! ఎమ్మెల్యే సత్యం కు కృతజ్ఞతలు..!!



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్లపేట గ్రామ గంగమ్మగుడి వద్ద కల్వర్టు నిర్మాణం కోసం రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయి. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్ (డిఎంఎఫ్) నుండి ఈ నిధులు సమకూరాయి.ప్రతి వర్షాకాలంలో వరదనీరు లో లెవెల్ బ్రిడ్జి పైగా ప్రవహించి గ్రామస్తుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ వచ్చింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే సత్యం కృషి చేయడంతో కల్వర్టు నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి.గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గూడ విజయ్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేడిపల్లి దేవానందం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేడిపల్లి రవీందర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ ప్రకృతి పరిరక్షణ

# మనందరి బాధ్యత




**కమాన్ పూర్** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని లైన్స్ క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి అన్నారు. సోమవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రామగిరి ఖిల్లా పై విత్తనపు బంతులు వేయడం జరిగిందిపర్యావరణాన్ని,సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రామగిరి ఖిల్లా గుట్ట ప్రాంతంలో దాదాపు 500 విత్తనము బంతులను విసిరివేయడం జరిగింది. విత్తనము బంతుల్లో అల్ల నేరడి, సీతాఫలం,వేప,నిమ్మ వంటి పండ్లు మరియు కూరగాయల విత్తనాలతో కూడిన మట్టితో బంతులు తయారు చేయడం జరిగింది.అనంతరం లయన్స్ క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి మాట్లాడుతూ శ్రావణ మాసంలో రామగిరి ఖిల్లా వీక్షణకు వచ్చేవారు కూడా విత్తనపు బంతులు వేయాలని కోరుతున్నాము అలా చేయడం వల్ల మూగ జీవాలకు ఆహారం దొరుకుతుంది. విశ్వంలో జీవరాశుల మనుగడకు మూలాధారం అయిన భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించిందని వారిని విధ్వంసం చేయడం వల్ల మానవాళి పలు విపత్తులకు గురవుతుంది. మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి తర్వాత తరానికి అందించాలి ప్రకృతి వనరులు తరతరాల వారసత్వ సంపద కాబట్టి వాటిని భావి తరాల కోసం రక్షించాలి. భారతదేశములో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రిక సత్యాన్ని మరువకూడదు. విచక్షణ రహితంగా అటవీ సంపదను విద్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన ఆస్తినష్టం, ప్రాణ నష్టం సంభవిస్తుంది ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కొరకు మనందరం ఐక్యమై ఉద్యమించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. పర్యావరణ ప్రకృతి పరిరక్షణకు '3ఆర్' పద్ధతిలో తగ్గించడం (రెడ్యూ స్ ) తిరిగి వాడటం (రీయూజ్) పునరుద్ధరణ (రీసైక్లింగ్)వంటి పద్దతులు మనిషి జీవితములో బాగం కావాలి అలాగే అడవుల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలి. ప్రకృతి పర్యావరణ హితకరమైన చర్యలు చేపట్టాలి.ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ అన్నది ఒక నినాదం కాకుండా ప్రజల జీవన విధానం కావాలి. భావితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని బహుమతిగా ఇద్దాం. ప్రకృతి రక్షణ మనందరి కోసం భావితరాల కోసం మనిషి మనుగడ కోసం. స్వచ్ఛభారత్ నిర్మాణానికి పునరంకితమౌదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మొల్మూరి శ్రీనివాస్,సభ్యులు తీగల శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటాలకు కెటిఆర్ సమాధానం చెప్పాలి

- ఎంఎల్ఎ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్



**హైదరాబాద్** బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేస్తానన్న కవిత మాటాలకు కెటిఆర్ ఎందుకు సమాధానం చెప్పాలని ఎంఎల్ఎ నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. ఎంఎల్సి కవితను జైలు నుంచి బయటకు తీసుకరావడానికి బిజెపి వాళ్ల కాళ్లను కెటిఆర్ పట్టుకున్నారని రాజేందర్ రెడ్డి ఆరోపణలు చేశారు. సొంత చెల్లి కవిత విభేదించడం కన్నా పెద్ద సాక్ష్యాలు కావాలా? అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఎవరు అభివృద్ధి చేశారో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని కెటిఆర్ కు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. తాను చెప్పింది తప్పయితే ముక్కు నేలకు రాస్తానని, లేదంటే రాజకీయాల నుంచి కెటిఆర్ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్‌ను పదేళ్ల చేసిన అభివృద్ధి కంటే 18 నెలల్లో తాము ఎక్కువగా అభివృద్ధి చేశామని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

## పత్తి పంటలో వేరు కుళ్ళు తెగులు.. జాగ్రత్తలు అవసరం

**- మండల వ్యవసాయ అధికారి : కె. ప్రణీత**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామంలో సోమవారం రైతు గాజుల రాజు వేసిన పత్తి పొలాన్ని మండల వ్యవసాయ అధికారి ప్రణీత,ఏఈఓ లక్ష్మణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పత్తి పంటలో వేరు కుళ్ళు తెగులు గమనించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ ఈ తెగులు భూమిలో ఉండే శిలీంద్రం ద్వారా వ్యాపిస్తుందని, భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు పంట అన్ని దశల్లో కనిపిస్తుందని వారు వివరించారు. మొక్కలు అర్థాంతరంగా ఎండిపోవడం, గుంపులుగా వాడిపోవడం లక్షణాలుగా ఉంటాయి.

### నివారణ చర్యలు:

కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా. లేదా కార్బెండాజిం 1 గ్రా. ను లీటరు నీటికి కలిపి, తెగులు సోకిన మొక్కల చుట్టూ నేలపై పోయాలి.పొటాష్ ఎరువులను తప్పనిసరిగా వాడాలి.

### ఎరువుల వాడకంపై సూచనలు:

డీఏపీ లేదా కాంప్లెక్స్ ఎరువులను పైపాటు కాకుండా కేవలం అడుగుమందుగా మాత్రమే వాడాలి. పత్తి పంటలో 20, 40, 60, 80 రోజుల్లో పైపాటు 25 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలి.వరి పంటలో ఎకరానికి 90 కిలోల యూరియా, 50 కిలోల 20-20-0-13, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరం.20-20-0-13 ను పూర్తిగా అడుగుమందుగా వేయాలి. యూరియాను 3 దఫాలుగా (నాటు సమయంలో, దుబ్బు సమయంలో, చిరుకంకి దశలో) 30 కిలోల చొప్పున వేయాలి. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 2 దఫాలుగా నాటు సమయంలో, చిరుకంకి దశలో వేయాలి.

### రైతులకు అధికారుల విజ్ఞప్తి:

యూరియా అధికంగా వాడడం వల్ల చీడపీడలు పెరగడం,నేల ఆరోగ్యం దెబ్బతినడం, పర్యావరణ కాలుష్యం పెరగడం జరుగుతుందని అధికారులు హెచ్చరించారు. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులను వాడకూడదని విజ్ఞప్తి చేశారు.

## ఏఎస్ఐగా పదోన్నతి పొందిన
# సత్తయ్యకు ఘన సన్మానం

**- జిల్లా ఎస్పీ : మహేష్ బి. గీతే అభినందనలు...! ?**

**శుభాకాంక్షలు...!!**




బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో గత మూడున్నర ఏళ్లుగా కర్తవ్య నిబద్ధతతో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య ఏఎస్ఐగా సోమవారం పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సత్తయ్యకు పూలమొక్కను అందించి, అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజా కుమార్ సిబ్బందితో కలిసి సత్తయ్యకు శాలువాతో ఘనంగా సన్మానించి,శుభాకాంక్షలు తెలిపారు.పదోన్నతి పొందిన సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, "బోయినిపల్లి మండల ప్రజలు తన సేవా కాలంలో అందించిన సహకారం మరువలేనిది" అని కృతజ్ఞతలు తెలిపారు.

## ఫ్రీ హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి...

**- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్) ట్రైమ్ న్యూరో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ విక్రాంత్ సింగ్ ఎండీ స్వయంగా అగస్టు 03న కరీంనగర్‌లో నిర్వహించే ఫ్రీ హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు. నరాల బలహీనతతో బాధపడేవారికి ఈ క్యాంపు ద్వారా లైఫ్‌లాంగ్‌హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. హెల్త్ కార్డు ద్వారా వచ్చే వారికి ఫీజులో రాయితీతో పాటు డాక్టర్ స్వయంగా వైద్యసేవలు అందిస్తారని, అలాగే వైద్యపరీక్షలు, మందుల్లో రాయితీ ఉంటుందన్నారు. డాక్టర్ విక్రాంత్ సింగ్ తాత మహవీర్ సింగ్ ముత్తారం మండలం పారుపల్లిలో ఉపాధ్యాయుడిగా పని చేశారని, ఈక్రమంలో ఈ ప్రాంతం ఉన్న మమకారంతో ఈ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఈ హెల్త్ క్యాంపులో పాల్గొని ఉచితంగా పరీక్షలతో పాటు మందులు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## "ప్రతిభకు పట్టం"సాహితీ సేవా

**ట్రస్ట్ ఇంటర్నేషనల్ అవార్డుతో సన్మానం**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో మేమున్నామంటూ నాలుగు, ఐదు దశాబ్దాల అనుభవం ఉన్న మేధావులు ఈ తరానికి తెలుగు కమ్మధనాన్ని చాటుతున్నారు.అలాగే సనాతన ధర్మాన్ని అనుసరించి పాఠ్యపుస్తకాలు వ్యావహారిక భాషలో రచనలు చేయడమే కాకుండా,మన గతాన్ని గ్రంధాలు రూపంలో కూడా వెలుగులోకి తీసుకువస్తున్నారు.ఇలాంటిప్రముఖులను ప్రభుత్వాలు, సేవ సంస్థలు గుర్తించి అవార్డులు అందజేయడం మన ఆనవాయితీ.ఈ నేపథ్యంలో తెలుగు సాంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఇంటర్నేషనల్ అవార్డు బెంగళూరు గ్లోబల్ ఎక్సలెన్సీవ్ అవార్డు27/07/ 2025 డా" బ్రహ్మశ్రీ పిట్టంపల్లి రామలింగ చారి ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీతగా అయోధ్య బాల రాముని స్వర్ణ పాదుకా రూపశిల్పి వారికి నిన్నటి కార్యక్రమంలో ఘనంగా గ్లోబల్ ఎక్సలెన్సివ్ అవార్డుతో సత్కరించారు.ఈకార్యక్రమంలో గౌరవనీయులు ఇంటర్నేషనల్ తెలుగు సాహితీ సాంస్కృతి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మాచవరం గౌరీ శంకర్, ముఖ్య అతిథులుగా మోహన రావు శర్మగారు స్థపతి కార్యక్రమానికి హాజరైనారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి
# కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ట్రాక్టర్ ఇసుక రవాణకు 1500 కంటే ఎక్కువ ఛార్జ్ చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్**




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెరగాలని , ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ అయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతిపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మండలాల వారిగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, మార్కింగ్ చేసిన ఇండ్లు, నిర్మాణం జరుగుతున్న ఇండ్లు, వాటి పురోగతి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం 8 వేల 811 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 5011 ఇండ్ల మార్కింగ్ జరిగిందని, 1485 ఇండ్లు బేస్మెంట్ స్థాయికి, 122 గోడల దశ వరకు, 50 ఇండ్లు రూఫ్ వరకు నిర్మాణం జరిగాయని తెలిపారు. శ్రావణ మాసంలో పెండింగ్ ఇండ్ల మార్కింగ్ పనులు కూడా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు నియంత్రణలో ఉండేలా మండల స్థాయి కమిటీ పని చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రధానమంత్రి ఆవాస్ యోజన యాప్ లో సర్వే వివరాల నమోదు రెండు రోజులలో పూర్తి చేయాలని అన్నారు. ప్రతి మండలంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభమయ్యే విధంగా అధికారులు లబ్ధిదారులతో చర్చలు జరపాలని కలెక్టర్ తెలిపారు. నగదు సమస్య ఉన్న లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు కార్యచరణ చేపట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు క్యాప్చర్ చేస్తూ ఆన్ లైన్ లో నమోదు చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ తరఫు నుంచి ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చూడాలని, మన దగ్గర పెండింగ్ ఉండకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఇసుక తీసుకెళ్ళేందుకు కూలీ, రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందని, జిల్లాలో ఎక్కడైనా 1500 కంటే ఎక్కువ ట్రాక్టర్ ఇసుక సరఫరా కోసం వసూలు చేస్తే అధికారుల దృష్టికి తీసుకుని రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోనే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, మోడల్ స్కూల్స్ లను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యా సంస్థల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉన్నాయా, నీరు నిల్వ ఉంటుందా, విద్యార్థులకు అందించే ఆహార, త్రాగునీటి నాణ్యత, ఎలా ఉంది వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. ఈ సమావేశంలో పిడి హౌసింగ్ శంకర్ రెడ్డి మండల ప్రత్యేక అధికారులు తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాణుగుపహాడ్ చిటకోడూర్ బ్రిడ్జి లు నిర్మించాలి

**ప్రారంభమైన రిలే నిరాహారదీక్షలు**




జనగమ (ప్రశ్న న్యూస్) జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర గానుగుపహాడ్, చిటకోడూరు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి అని రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ను సాధన సమితి ఆధ్వర్యంలో చెపట్టడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని బిఆర్ఎస్ జనగామ మండల అధ్యక్షులు భైరగోని యాదగిరి గౌడ్ ప్రారంభించారు.నిరాహారదీక్షల లో మాట్లాడిన సాధన సమితి అధ్యక్షులు యాసారపు కరుణాకర్ రెండు సంవత్సరాల నుండి కూలిపోయిన గానుగుపహడ్ చిటకోడూర్ వంతెన ల దగ్గర ప్రజలు,వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తాత్కాలికంగా వేసిన రోడ్డు లు వర్షాలకు కొట్టుకుపోతున్నాయి అని గత ఆరు నెలల నుండి కలెక్టర్, ఎంఎల్ఎ,ఎంపీ,మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా కానీ గానుగుపహాడ్ వద్ద అసంపూర్తి గా ఉన్న వంతెన వర్షాలకు కూలిపోయి చిటకోడూరు వంతెన పనులు ప్రారంభం కాలేదు అని ఎన్ని ప్రమాదాలు జరిగినా అధికారులకు,ఎంఎల్ఎ, నాయకులకు పట్టించుకోకపోవడం తో ఈ రోజు నుండి జనగామ కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీలకు అతీతంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు.
గత 20 రోజుల క్రితం గానుగుపహాడ్ వంతెన వద్ద కార్ వంతెన లో పడిపోయి నలుగురు ప్రాణాలతో బయట పడినా పట్టించుకోని జిల్లా కలెక్టర్ జనగామ లో నీ బతుకమ్మ కుంట కు కోటి యాభై లక్షల రూపాయలతో సుందరీకరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు అని అన్నారు. గానుగుపహాడ్ వంతెన పనులు చేసిన కాంట్రాక్టర్ కు కోటి రూపాయల నిధులు విడుదల చేస్తారా లేక అగ్రిమెంట్ ప్రకారం తొమ్మిది నెలలలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్ట్ లో పెడుతారా అని డిమాండ్ చేశారు.
ఈ దీక్ష కు వడిచెర్ల ఎంపీటీసీ గండి యాదగిరి సంఘీభావం తెలిపారు. ఈ రిలే నిరాహార దీక్షలో ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు, జెరిపోతుల శ్యామ్, పొన్నగంటి చిరంజీవి, గానుగుపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ పద్మ బాలస్వామి, గ్రామ అధ్యక్షులు ఎడమ ఐలయ్య, కొర్ర శంకర్ నాయక్, సిద్దులు, , సదానందం, నరేష్, రాజశేఖర్, అజిత్ బొట్ల రాజు పలు గ్రామాల ప్రజలు, ప్రధాన కార్యదర్శి ఇరుగు సిద్దులు ,సాట్ల బాలరాజు, దడిగే సందీప్, సదానందం పులి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దకాలం తర్వాత నిజమైన
# తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు న్యాయం
- తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారం
- రవీంద్రభారతిలో కన్నుల పండువగా తెలంగాణ సన్మాన్ పురస్కారాల ప్రధానోత్సవం



**హైదరాబాద్ :**దశాబ్ద కాలం తర్వాత నిజమైన తెలంగాణ పోరాట యోధులకు గుర్తింపు లభించడం అభినందనీయమని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.ఆదివారం తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షులు నారగౌని పురుషోత్తం నేతృత్వంలో రవీంద్రభారతిలో తెలంగాణ సన్మాన్ 2025 పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీర్ల ఐలయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పురస్కారాన్ని బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయ సంస్థ జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ సభకు అధ్యక్షత వహించారు. భాషాభివృద్ధి సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మికి వీరనారి చిట్యాల ఐలమ్మ స్మారక పురస్కారాన్ని అందజేశారు. వీరితో పాటు సీనియర్ ఫిలిం క్రిటిక్ పొన్నం రవిచంద్రకు పైడి జయరాజ్ స్మారక పురస్కారం, ప్రముఖ గాయకులు దరువు అంజన్నకు ప్రజా యుద్ధ నౌక గద్దర్ స్మారక పురస్కారం, సీనియర్ పాత్రికేయులు కాసుల ప్రతాపరెడ్డికి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభిస్తోందని అన్నారు. పది సంవత్సరాలుగా ఉద్దేశపూర్వకంగా అనగదొక్కిన కవులు, కళాకారులకు అసలైన గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు. దొరల గడీలకు భజన చేసే కళాకారులకు తప్ప అసలైన ఉద్యమకారులకు గుర్తింపు లభించలేదని అన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కేవలం తనకు వంత పాడలేదన్న ఉద్దేశంతో కెసిఆర్ దూరం పెట్టిన వారందరిని సీఎం రేవంత్ రెడ్డి గుర్తించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నా సరే ఉద్యమంలో వారు చేసిన పనిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అవార్డు గ్రహీత ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ స్థాపించి నాటి అసలు సిసలైన తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు నిస్తూ ప్రోత్సహించే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట అవార్డు ఇవ్వడంతో తన బాధ్యతను పెంచిందని, ఈరోజు నుంచి మరింత జాగ్రత్తతో తన విధులు నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. బీసీ కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ పురస్కార గ్రహీత రంగు బాలలక్ష్మి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పుట్టిన గడ్డ నుంచి తాను రావడం, ఉస్మానియా యూనివర్సిటీలో చదువుకుంటూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడడం..., సాధించిన రాష్ట్రంలో వివక్షతను ఎదుర్కొంటూ దశాబ్ద కాలం తర్వాత ఇటువంటి సన్మానాన్ని అందుకోవడం సంతోషకరమని అన్నారు. పైడి జయరాజు పురస్కార అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర మాట్లాడుతూ దాదాసాహెబ్ అవార్డు పొందిన పైడి జయరాజును తెలుగు చలనచిత్ర రంగం పరిశ్రమ అనేక దశాబ్దాలుగా విస్మరించిందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన సేవలు గుర్తించలేదని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే అలా మరుగున పడిపోయిన వారికి గుర్తింపు లభిస్తోందని అన్నారు.గద్దర్ అవార్డు గ్రహీత దరువు అంజన్న మాట్లాడుతూ తెలంగాణ కోసం నిరంతరం కొట్లాడిన పోట్లాడిన గద్దర్ అన్న స్మారక అవార్డు తనకు లభించడం తనకెంతో చిరస్మరణీయమని తెలిపారు.

పన్నెండ్లుగా గుర్తింపు లేని తమకు ఈ అవార్డు ఇవ్వడం గద్దర్ అన్నను స్మరించుకోనే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి స్మారక అవార్డు గ్రహీత కాసుల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆ మహనీయుని పేరిట తనకు అవార్డు ఇవ్వడం తెలంగాణ ఉద్యమంలో తనను గుర్తించడం ఎంతో బాధ్యత పెంచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు కాలేరు సురేష్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సీనియర్ నాయకురాలు మెరుగు సునీత తదితరులు పాల్గొన్నారు.



## హొంబాలే సంస్థకు 'నరసింహ' వరం

కెజిఎఫ్, కాంతార లాంటి సినిమాలతో శాండల్ వుడ్ ని ఎక్కడికో తీసుకెళ్లిన హొంబాలే ఫిలిమ్స్ కి పట్టిందల్లా బంగారం అవుతోంది. తెలుగులో సలార్ తో ఎంట్రీ ఇచ్చి ప్రభాస్ తర్వాత ఇప్పుడు మళ్ళీ ప్రభాస్ తోనే మరో మూడు ప్యాన్ ఇండియా మూవీస్ ప్లాన్ చేస్తున్న ఈ బ్యానర్ కు తాజాగా ఇంకో జాక్ పాట్ తగిలింది. శుక్రవారం విడుదలైన యానిమేషన్ మూవీ మహావతార్ నరసింహకు అంచనాలకు మించి కలెక్షన్లు దక్కుతున్నాయి. నిజానికి ట్రైలర్ వచ్చాక కూడా దీని మీద పెద్దగా బజ్ లేదు. ఒక వర్గం ఆడియన్స్ మాత్రం మొదటి రోజు వెళ్లారు. మార్నింగ్ షోల వరకు ఆక్యుపెన్సీలు అంతంత మాత్రమే. కానీ గంటల వ్యవధిలో సీన్ రివర్స్ అయ్యింది.ముఖ్యంగా వీకెండ్ బుకింగ్స్ అరాచకం అనిపించే స్థాయిలో ఉన్నాయి. హరిహర వీరమల్లు ధాటిని తట్టుకుంటుందా అనే అంచనాలని మించి హౌస్ ఫుల్స్ బోర్డులతో థియేటర్లను కిక్కిరిసిపోయేలా చేయడం ఊహించని ట్విస్టు. ఆదివారం ఉదయం గంటకు 27 వేల దాకా టికెట్లు అమ్మిన బుక్ మై షోలో రాత్రికి సైతం 10 వేలకు తగ్గకుండా దూకుడు కొనసాగించడం విశేషం. కేవలం సైయారా మాత్రమే దీనికి ధీటుగా నెంబర్లు నమోదు చేయడం మరో ట్విస్టు. వీరమల్లు కూడా ట్రెండింగ్ చూపించినప్పటికీ పవన్ కళ్యాణ్ స్థాయిలో కాదనేది వాస్తవం.

హాలీవుడ్ మూవీ ఫెంటాస్టిక్ ఫోర్ ఫస్ట్ స్టెప్స్ మెరుగ్గానే కనిపించింది. ఇక మహావతార్ నరసింహ విషయానికి వస్తే ఫస్ట్ హాఫ్ లో మొదటి నలభై నిముషాలు, చివరి అరగంట జనాలకు పూర్తి పైసా వసూల్ అనిపించేస్తున్నాయి. మాస్ ఎలివేషన్లు ఇచ్చి నరసింహావతారంలో శ్రీవిష్ణువు హిరణ్యకశిపుడిని హతమార్చే ఎపిసోడ్ కు ఈలలు కేకలతో థియేటర్లు హోరెత్తిపోతున్నాయి.



## కింగ్డమ్ బిజినెస్ లక్ష్యం ఎంత

గురువారం విడుదల కాబోతున్న కింగ్డమ్ మీద టీమ్ లోనే కాదు పరిశ్రమ వర్గాల్లోనూ భారీ అంచనాలున్నాయి. ఇండస్ట్రీ హిట్ అవుతుందని భావించిన హరిహర వీరమల్లు ఆశించిన స్థాయిలో ఆడే సూచనలు తగ్గిపోవడంతో ఇప్పుడు బాక్సాఫీస్ కు ఉత్సాహం ఇవ్వాల్సిన బాధ్యత విజయ్ దేవరకొండ మీద ఉంది. సాలిడ్ గా రెండు వారాలకు ఓపెన్ గ్రౌండ్ దొరకనున్న నేపథ్యంలో వీలైనంత వసూళ్లు ఆలోగానే రాబట్టుకోవాలి. ఆగస్ట్ 14 కూలి, వార్ 2 ఒకేసారి దిగుతాయి. అప్పటి నుంచి ఆడియన్స్ మూడ్ వాటివైపుకి షిఫ్ట్ అయిపోతుంది. అందుకే ప్రమోషన్ల పరంగా ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా ప్లాన్ చేసుకుంటున్నారు.ఇక థియేటర్ బిజినెస్ విషయానికి వస్తే సుమారు 100 కోట్ల గ్రాస్ లక్ష్యంతో కింగ్డమ్ బరిలో దిగుతోంది. అంటే షేర్ కొంచెం అటు ఇటుగా 55 కోట్ల దాకా రావాల్సి ఉంటుంది. నైజాం 15 కోట్లు, సీడెడ్ 6 కోట్లు, ఆంధ్ర 15 కోట్లు, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాలు 3.5 కోట్లు, ఓవర్సీస్ 10 కోట్లు, ఇతర డబ్బింగ్ వెర్షన్లు 4 కోట్ల దాకా డీల్స్ జరిగినట్టు ట్రేడ్ టాక్. బ్రేక్ ఈవెన్ కావాలంటే బ్లాక్ బస్టర్ టాక్ వల్లే సాధ్యం. ట్రైలర్ తో సరిపడా బజ్ వచ్చేసింది.

కెజిఎఫ్ రేంజ్ లో ఎలివేషన్లు, యాక్షన్లు ఉన్నాయనే క్లారిటీ దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఇవ్వడంతో అభిమానులు ఫుల్ హ్యాపీగా ఉన్నారు. ఇక కావాల్సిందల్లా టాక్ మాత్రమే. ముందు రోజు ప్రీమియర్లు వేసే సూచనలు తగ్గిపోతున్నాయి. బుధవారం షోల ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ కలుగుతున్న నేపథ్యంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదట. సోమవారం హైదరాబాద్ యూసఫ్ గూడ గ్రౌండ్స్ లో జరగబోయే ప్రీ రిలీజ్ ఈవెంట్ తర్వాత హైప్ మరింత ఎగబాకుతుందనే నమ్మకంతో టీమ్ ఉంది.

## మండల మర్డర్స్ అంత ప్రత్యేకంగా ఉందా



ఈ మధ్య వెబ్ సిరీస్ లను జనం అంత సీరియస్ గా పట్టించుకుంటున్నట్టు లేదు. కొత్త రిలీజులు ఉంటున్నా ఎక్స్ ట్రాడినరి రివ్యూలు, సోషల్ మీడియా టాక్స్ వస్తే తప్ప ఆడియన్స్ దృష్టిలో పడటం లేదు. అలాంటిదే మండల మర్డర్స్. మొన్న శుక్రవారం నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది. నాని ఆహా కళ్యాణం హీరోయిన్ వాణి కపూర్ ప్రధాన పాత్ర పోషించగా చాలా పెద్ద బడ్జెట్ తో దీన్ని నిర్మించారు. గోపి పుత్రన్ – మనన్ రావత్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. యష్ రాజ్ ఫిలింస్ నిర్మాణ భాగస్వామి కావడంతో ఖర్చు పరంగా రాజీ లేకుండా ప్రొడక్షన్ చేయడం వల్ల మంచి క్వాలిటీ స్క్రీన్ మీద కనిపించింది.స్టోరీ లైన్ ఆసక్తికరంగా ఉంటుంది. 1952 నుంచి 2025 మధ్యలో డిఫరెంట్ టైం ఫ్రేమ్స్ లో చూపిస్తారు. ఉత్తర్ ప్రదేశ్ లోని చరణ్ దాస్ అనే ఊరికి దగ్గరలో ఉన్న వరుణ అడవిలో ఒక మాంత్రికుల గుంపు ఉంటుంది. ఎవరైనా వచ్చి బొటన వేలిని సమర్పిస్తే ఎంత పెద్ద కోరిక అయినా తీర్చే సైతాన్ దైవం వాళ్ళ స్వంతం.

హఠాత్తుగా చాలా దారుణమైన స్థితిలో కొందరి హత్యలు జరుగుతాయి. దీని ఇన్వెస్టిగేషన్ చేపట్టిన లేడీ సిబిఐ ఆఫీసర్ కు తోడుగా ఢిల్లీ నుంచి వచ్చిన సస్పెండ్ పోలీస్ కలిసి విస్తుపోయే నిజాలు తెలుసుకుంటారు. ఇదంతా ఎవరు చేస్తున్నారో తెలుసుకునే క్రమంలో దారుణమైన వాస్తవాలు బయట పడతాయి. మూఢనమ్మకం, రాజకీయం, సామజిక పరిస్థితులు, జనాల అమాయకత్వం ఇలా అన్ని అంశాలను జోడించి మండల మర్డర్స్ ని ఎనిమిది ఎపిసోడ్లుగా రూపొందించారు. బోలేడన్ని పాత్రలు ఉన్నప్పటికీ ప్రతిదానికి తగిన ప్రాధాన్యం ఇచ్చి వాటిని ట్విస్టులకు ముడిపెట్టిన విధానం ఆకట్టుకుంది. టెక్నికల్ గా మంచి స్టాండర్డ్ లో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్ లో మలుపులు ఊహకందని విధంగా ఉంటాయి. హింస ఉన్నప్పటికీ మరీ జుగుప్సాకరంగా అనిపించదు. ఒకటి రెండు తప్ప పెద్ద అడల్ట్ సీన్స్ లేవు. తెలుగు డబ్బింగ్ ఉంది. గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే ప్రధాన బలంగా సాగే మండల మర్డర్స్ ని ఈ జానర్ ఆడియన్స్ ట్రై చేయొచ్చు. నిరాశపరచదు.

## సినిమా తీస్తే తెలుస్తుంది



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన హరిహర వీరమల్లు మూవీ రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు మూడేళ్ల తర్వాత పవన్ కళ్యాణ్.. సిల్వర్ స్క్రీన్ పై కనిపించారనే చెప్పాలి. పీరియాడిక్ యాక్షన్ జోనర్ లో రూపొందిన ఆ సినిమాతో ఇప్పుడు వరల్డ్ వైడ్ గా థియేటర్స్ లో సందడి చేస్తున్నారు పవర్ స్టార్. పీరియాడిక్ యాక్షన్ జోనర్ లో తెరకెక్కిన వీరమల్లు మూవీకి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మించారు. అయితే సినిమా రిలీజ్ అయ్యాక వైసీపీ నేత అంబటి రాంబాబు.. తన యూట్యూబ్ ఛానెల్ లో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. హొంబలె లక్కు కాదు.. లెక్క ఇది..! మూడేళ్ల తర్వాత పవన్ మూవీ వస్తుండడంతో అందరిలో ఉత్కంఠ నెలకొందని, సినిమా హిట్ అవ్వాలని అందరూ కోరుకున్నారన్నారని అంబటి రాంబాబు అన్నారు. సినిమా సూపర్ డూపర్ హిట్ కావాలని ట్వీట్ చేసినట్టు మరోసారి చెప్పారు. అనేక ఒడిదుడుకుల మధ్య హరిహర వీరమల్లు సినిమా నిర్మాణం పూర్తి అయిందని తెలిపారు. అందుకే నిర్మాత రత్నానికి కనక వర్షం కురిపించాలని కూడా కోరుకున్నట్టు చెప్పిన అంబటి రాంబాబు.. తన ట్వీట్ పై చాలా చర్చ జరిగిందని తెలిపారు. అయితే టికెట్ ధరలతో ప్రేక్షకుల్ని దోపిడీ చేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆయన వ్యాఖ్యలకు నిర్మాత రత్నం రెస్పాండ్ అయ్యారు. ఇండియన్ 3 వచ్చే ఛాన్స్ ఉందా...! సినిమాకు ఇష్టం ఉన్న వాళ్ళు వస్తారని, ఇష్టం లేని వాళ్ళు బలవంతంగా రారని ఏఎం రత్నం తెలిపారు. కానీ కొందరు గిట్టని వాళ్లు.. అంబటి రాంబాబు వంటి వారు టికెట్ రేట్లు పెంచారు.. దోచుకున్నారు అని అంటున్నట్లు చెప్పారు.

## క్రైమ్ థ్రిల్లర్‌గా 'వన్ వే టికెట్'



వరుణ్ సందేశ్, కుష్బూ చౌదరి జంటగా 'వన్ వే టికెట్' అనే కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ పతాకాలపై ఈ మూవీని జొరిగే శ్రీనివాసరావు నిర్మిస్తు న్నారు. ఏ.పళని స్వామి దర్శకుడు. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు వచ్చిన ముఖ్య అతిథులు నిర్మాత సి. కళ్యాణ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. దర్శక, నిర్మాత త్రినాధరావు నక్కిన కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమానికి టీఎస్ రావు అతిథిగా విచ్చేశారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, 'ఈ టైటిల్‌తో పాటు పళని చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో కొత్త పాత్రను పోషిస్తున్నాను' అని అన్నారు. 'శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ బ్యానర్లపై ఇది మా రెండో చిత్రం. మంచి కంటెంట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం' అని నిర్మాత శ్రీనివాసరావు చెప్పారు. దర్శకుడు ఏ.పళని స్వామి మాట్లాడుతూ, 'క్రైమ్ థ్రిల్లర్‌గా ఇది ప్రేక్షకుల్ని థ్రిల్ చేస్తుంది. మనోజ్ నందం, సుధాకర్ ముఖ్య పాత్రలు చేస్తున్నారు' అని తెలిపారు.

## మౌనంగా ఘాటీ.. అజ్ఞాతంలో స్వీటీ

అనుష్క ఘాటీ ఇప్పటికి రెండుసార్లు వాయిదా పడింది. ఏప్రిల్ 18, జూలై 11 ఈ ఏడాది వదులుకున్న డేట్లు. వీటిలో ఏ తేదీకి వచ్చినా మంచి ఓపెనింగ్స్ తో పాటు సాలిడ్ రన్ దక్కేది. కానీ రకరకాల కారణాల వల్ల పోస్ట్ పోన్ తప్పలేదు. పోస్ట్ ప్రొడక్షన్, విఎఫ్ఎక్స్ లాంటి రీజన్స్ చెబుతున్నారు కానీ నిజానికి అంత హెవీ వర్క్ ఉన్న గ్యాంగ్ స్టర్ డ్రామా అయితే ఇది కాదు. మరి ఎందుకు లేట్ అవుతుందనేది అంతు చిక్కడం లేదు. ఫిలిం నగర్ వర్గాల్లో సెప్టెంబర్ 5 రావొచ్చనే ప్రచారం మొన్నటిదాకా జరిగింది. కానీ ఇప్పుడా సౌండ్ లేదు. ఎందుకంటే తేజ సజ్జ మిరాయ్ అదే డేట్ కి ముందు ప్రకటించినట్టుగా రిలీజ్ కాబోతోంది కాబట్టి. ముందైతే ఘాటీ నిర్మాతలు యువి క్రియేషన్స్ మౌనం వీడాలి. చూచాయగా ఎప్పుడు వస్తుందో హింట్ ఇవ్వాలి. ఇదే తరహాలో విశ్వంభరని విపరీతమైన జాప్యానికి గురి చేసిన ప్రొడ్యూసర్లు దాని బజ్ తగ్గిపోవడంలో టీజర్ తో పాటు సమాన బాధ్యత పంచుకున్నారు. ఇప్పుడు ఘాటీకి కూడా ఇంచుమించు అదే పరిస్థితి కనిపిస్తోంది. దర్శకుడు క్రిష్ ఎక్కడా కనిపించడం లేదు. హరిహర వీరమల్లుకు ట్విట్టర్ లో విష్ చేసి ఊరుకున్నాడు తప్పించి తన వంతుగా మీడియా ముందుకొచ్చి విశేషాలు పంచుకోలేదు. సరే ఘాటీ పనుల్లో బిజీగా ఉన్నాడని అనుకున్నా కనీసం ఒకటి రెండు రోజులు తీరిక చేసుకోవచ్చు కదా. ఇక అనుష్క సంగతి సరేసరి. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి తర్వాత స్క్రీన్ మీద, స్క్రీన్ బయట ఎక్కడా దర్శనమివ్వలేదు. ఘాటీ ప్రమోషన్లకైనా వస్తుందో రాదో తెలియదు. తన మీద ఎన్ని గాసిప్స్ వస్తున్నా పట్టించుకోకుండా అజ్ఞాతంలోనే ఉన్న స్వీటీని ఓసారైనా నేరుగా చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కానీ ఆ కోరిక నెరవేరేలా లేదు. స్వీటీని ఎప్పుడు చూస్తామంటూ ప్రశ్నించడమే తప్ప సమాధానం దొరకడం లేదు. ఒకవేళ ఘాటీ కనక సెప్టెంబర్ వదులుకుంటే అక్టోబర్ నుంచి డిసెంబర్ దాకా ఏదో ఒకటి వీలైనంత త్వరగా లాక్ చేసుకోవాలి. లేదంటే బజ్ మరింత కిందకు వెళ్లిపోయే ప్రమాదముంది. ఫ్యాన్స్ భయపడుతోంది అదే.



# గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు ఎదిరె దేవయ్య కన్నుమూత

**- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు ఎదిరె దేవయ్య (75) గుండెపోటుతో సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. దేవయ్య గతంలో గౌడ సంఘం అధ్యక్షునిగా వ్యవహరిస్తూ గౌడ కులస్తుల అభ్యున్నతి కోసం అనేక సేవలు అందించారు. కోనాయిపల్లి గ్రామపంచాయతీ ఉన్న సమయంలో వార్డు సభ్యుడిగా ప్రజలకు సేవలందించిన ఆయన, గ్రామాభివృద్ధికి విశేష కృషి చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. దేవయ్య మరణ వార్త తెలిసిన వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన అంత్యక్రియల్లో కోనాయిపల్లి గ్రామ ప్రజలు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవయ్యకు చివరి వీడ్కోలు పలికారు.

# బీజేపీ కార్యకర్తల సమావేశం

## - ఎన్నికల విజయానికి సన్నాహాలు వేగం

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- భాజపా మాజీ జిల్లాధ్యక్షులు : ప్రతాప రామకృష్ణ ల పిలుపు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భాజపా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేయడం ప్రతి కార్యకర్త లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథి ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో బీజేపీ జెండా రెపరెపలాడేలా కృషి చేయాలని కార్యకర్తలకు ప్రేరణనిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా జూలై 30, 2025 (బుధవారం) న బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో "హరిహర వీరమల్లు" సినిమాను ఉచితంగా నాలుగు షోలు ప్రదర్శించనున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా సనాతన ధర్మం,హిందుత్వ ఐక్యత ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# భక్తుల ప్రాణాలు కాపాడాలి

**- వెంటనే స్నేక్ క్యాచర్లను నియమించాలి**

**- విశ్వహిందూ పరిషత్ నాయకులు : గడప కిషోర్ రావు డిమాండ్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లో వర్షాకాలం నేపథ్యంలో పాముల సంచారం పెరిగిపోతోంది. భీమేశ్వరాలయం, పార్వతీపురం, భీమేశ్వర సదన్, లడ్డూ కౌంటర్, పి.ఆర్.ఓ.కార్యాలయం, గోశాలలో పాములు కనిపించడం వల్ల భక్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల ప్రాణ భద్రత కోసం వెంటనే స్నేక్ క్యాచర్లను నియమించాలి అని విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి) నాయకులు గడప కిషోర్ రావు డిమాండ్ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు, సిబ్బందిని పాము కాటు వంటి ప్రమాదాల నుంచి రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆయన దేవాదాయ శాఖ అధికారులను కోరారు. "భక్తుల భద్రత అత్యంత ప్రాధాన్యం. వెంటనే స్నేక్ క్యాచర్లను నియమించి, ఆలయ పరిసరాలను సురక్షితంగా ఉంచాలి" అని కిషోర్ రావు స్పష్టం చేశారు.

# మున్నూరుకాపుల ఐక్యత కోసం రాజకీయాలను సైతం వదిలేశా..!

**- త్వరలో లక్ష మందితో మున్నూరు కాపు పటేల్ ఎన్నికలు**

**- మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షులు : కొండ దేవయ్య పటేల్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య పటేల్ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మున్నూరు కాపుల ఐక్యత కోసం రాజకీయాలను కూడా వదిలేశాను. ఐక్యతను బలహీనపరిచే ప్రయత్నాలు విఫలమవుతాయి" అని స్పష్టం చేశారు. ఇటీవల వేములవాడలో నిర్వహించిన బోనాల సందర్భంగా, తమపై కుట్ర చేయాలని కొందరు ప్రయత్నించినా, ఆ ప్రయత్నం పూర్తిగా విఫలమైందని దేవయ్య అన్నారు. బోనాలకు దేశం నలుమూలల నుండి భక్తులు వచ్చినా, రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపులు మాత్రం తమపై నమ్మకం ఉంచి హాజరుకాలేదని పేర్కొన్నారు. 600 కార్లతో ర్యాలీ నిర్వహిస్తామన్నవారి ప్రయత్నానికి కనీసం 60 కార్లు కూడా రాలేదని ఆయన విమర్శించారు. త్వరలో లక్ష మందితో మున్నూరు కాపు పటేల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపు పటేల్స్ పోటీ చేసి రాజకీయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి మున్నూరు కాపు పటేల్ సభ్యుడు మన అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు.

# శ్రావణ మాసం శుభప్రదమైన మాసం

# శ్రావణ మాస పూజా విశేషాలు





పెద్దపల్లి ( ప్రశ్న న్యూస్) సృష్టి, స్థితి లయ కారకులైన త్రిమూర్తులలో స్థితికారుడు, దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడు అయిన శ్రీమహావిష్ణువుకు, ఆయన దేవేరి అయిన శ్రీమహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన, వివిధ వ్రతాలు, పూజలు ఆచరించడం వలన విశేష ఫలితాలు, సకల సౌభాగ్యాలను ప్రసాదించే దివ్యమైన మాసం "శ్రావణ మాసం"చాంద్రమానం ప్రకారం శ్రావణమాసం ఐదవ మాసం. లిఈ మాసంలోని పూర్ణిమనాడు చంద్రుడు శ్రవణ నక్షత్రం సమీపంలో ఉంటాడు కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చిందిలి . శ్రీ మహావిష్ణువు జన్మ నక్షత్రం "శ్రవణా నక్షత్రం" అటువంటి శ్రవణా నక్షత్రం పేరుతో ఏర్పడిన శ్రావణ మాసం శ్రీమహావిష్ణువు పూజకు ఉత్కృష్టమైన మాసం. శ్రావణ మాసంలోని మూడువారాలు అత్యంత పుణ్యప్రదమైనవి. లిమంగళ,శుక్ర, శనివారాలు ఈ మాసంలో అత్యంత ప్రధానమైనవి,మహత్తును కలిగినవి. శ్రావణ మసంలోని మంగళవారాలు శ్రీగౌరీ పూజకు,శుక్రవారాలు శ్రీలక్ష్మీ పూజకు, శనివారాలు శ్రీమహావిష్ణువు పూజకు ముఖ్యమైన దినాలులి . వీటికితోడు శ్రావణమాసంలోని శుక్లపక్షంలోగల పదిహేను రోజులు ఎంతో విశేషమైన రోజులనీ, ఒక్కోరోజు ఒక్కో దేవుని **పూజ చేయాలని శాస్త్ర వచనం.**

పాడ్యమి బ్రహ్మదేవుడు, విదియ శ్రీయఃపతి, తదియ పార్వతీదేవి, చవితి వినాయకుడు, పంచమి శశి, షష్టి నాగదేవతలు, సప్తమి సూర్యుడు, అష్టమి దుర్గాదేవి, నవమి మాతృదేవతలు, దశమి ధర్మరాజు, ఏకాదశి మహర్షులు, ద్వాదశి శ్రీమహావిష్ణువు, త్రయోదశి అనంగుడు, చతుర్దశి పరమశివుడు, పూర్ణిమ పితృదేవతలను పూజించాలి. మహిళలకు సౌభాగ్యానిచ్చే శ్రావణ మాస వ్రతాలు శ్రావణమాసం మహిళలకు అత్యంత ముఖ్యమైనది. మహిళలు పాటించే వ్రతాల్లో అధికం ఈ మాసంలోనే ఉండడంవల్ల వ్రతాలమాసమని, సౌభాగ్యాన్ని ప్రసాదించే మాసమని కూడా పేర్కొనబడింది.

### మంగళగౌరీ వ్రతం

శ్రావణమాసంలో ఆచరించే వ్రతాల్లో ముఖ్యమైనది ఈ వ్రతం. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్ళయిన ముత్తైదువలు చేయాలి. నెలలోని అన్ని మంగళవారాలు దీనిని చేయవలెను.

### వరలక్ష్మీ వ్రతం

మహిళలకు అత్యంత ముఖ్యమైన శ్రావణమాసంలో ఆచరించే మరో ప్రధానమైన వ్రతం శ్రీ వరలక్ష్మీ వ్రతం. దీనిని పూర్ణిమ ముందు వచ్చే శుక్రవారం ఆచరింపవలెను.

"శ్రావణమాసంలో వచ్చే పండగలు"

### శుక్లచవితి-నాగులచవితి

మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఈరోజు నాగులచవితి పండుగను జరుపుకుంటారు. ఉపవాసం ఉండి పుట్ట వద్దకు వెళ్ళి పాలు పోసి పూజిస్తారు.

### శుక్ల ఏకాదశి-పుత్రదా ఏకాదశి

ఈ ఏకాదశికే లలితా ఏకాదశి అని కూడా పేరు. పుత్ర సంతానం కావాలనుకునేవారు ఈనాడు ఏకాదశీ వ్రతాన్ని ఆచరించడం మంచిది.

### శ్రావణ పూర్ణిమ - రాఖీపూర్ణిమ

సోదరుడి సుఖసంతోషాలు కోరుతూ అక్కాచెల్లెళ్ళు సోదరుడి చేతికి రాఖీ కడతారు నుదుట బొట్టు పెట్టి.అనంతరం మిఠాయిలను తినిపిస్తారు. సోదరుడు సోదరి ఆశీర్వాదం తీసుకుని కానుకలివ్వడం ఆనవాయితీ. అంతే గాక ఈ దినం పాత యజ్ఞోపవీతాన్ని విసర్జించి కొత్తది ధరించడం ఆచారం.

### పూర్ణిమ - హయగ్రీవ జయంతి

వేదాలను రక్షించేందుకు శ్రీమహావిష్ణువు హయగ్రీవ రూపం ధరించినట్లు పురాణ కథనం.హయగ్రీవ జయంతి ఐన ఈ రోజు హయగ్రీవుడిని పూజించి శనగలు,ఉలవలతో గుగ్గిళ్ళు తయారుచేసి నైవేద్యం సమర్పిస్తారు.

### కృష్ణవిదియ- శ్రీ రాఘవేంద్రస్వామి జయంతి

క్రీ.శ.1671 వ సంవత్సరంలో విరోధికృత్ నామ సంవత్సరం శ్రావణ బహుళ విదియనాడు శ్రీ రాఘవేంద్రస్వామివారు సజీవంగా సమాధిలో ప్రవేశించారు.

### కృష్ణపక్ష అష్టమి - శ్రీకృష్ణాష్టమి

శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాల్లో ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణ పరమాత్మ జన్మించిన దినం. దీనినే కృష్ణాష్టమి లేదా జన్మాష్టమి అని పేర్లు. ఈ రోజు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం కృష్ణుడిని పూజించి నైవేద్యంగా పాలు, పెరుగు , మీగడ, వెన్నలను సమర్పించడం ఆచారం.

### కృష్ణపక్ష ఏకాదశి - కామిక ఏకాదశి

ఈ దినం ఏకాదశీ వ్రతం, ఉపవాసాలను పాటించడంతో పాటు నవనీతమును దానం చేయడం మంచిది.ఈ ఏకాదశీ వ్రతాన్ని పాటించడం వల్ల మనసులో ఉన్న కోరికలన్నీ నెరవేరుతాయని శాస్త్ర వచనం.

### కృష్ణపక్ష అమావాస్య - పోలాల అమావాస్య

ఇది వృషభాలను పూజించే పండుగ. కాగా కాలక్రమేములో పోలేరమ్మ అనే గ్రామ దేవతలను ఆరాధించే పర్వదినంగా మార్పు చెందింది. ఇది ఆచరించడం వల్ల పిల్లలకు అకాల మృత్యు

# శ్రావణ సోమవారంతో రాజన్న ఆలయం కిటకిటలాడింది

**- ప్రత్యేక పూజలు,వ్రతాలతో భక్తి పారవశ్యం**

**- వేలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు**


**- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం శ్రావణ మాసపు మొదటి సోమవారం సందర్భంగా భక్తి పారవశ్యంతో నిండిపోయింది. వేకువ జామునుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాజన్న దర్శనం కోసం కిలోమీటర్ల పొడవున క్యూలైన్లు ఏర్పడ్డాయి. మొక్కుబడులు తీర్చుకునే భక్తులు తలనీలాలు సమర్పించి,ధర్మగుండంలో పవిత్ర స్నానం చేసి, స్వామివారికి అత్యంత ప్రీతికరమైన కోడెమొక్కులు చెల్లించారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకొని, కుంకుమపూజలు,వ్రతాలు, కళ్యాణాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. భక్తులు 'ఓం నమశ్శివాయ' జపంతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. శ్రావణ సోమవారం కావడంతో ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం లింగార్చన నిర్వహించగా ఆలయం శోభాయమానంగా వెలిగిపోయింది. భక్తుల రద్దీ అధికంగా ఉన్నప్పటికీ ఆలయ ఈఓ రాధాబాయి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా జరిగాయి. తాగునీటి సదుపాయం, షెల్టర్‌లు, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలు తీసుకోవడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం సజావుగా కొనసాగింది. రాజన్న కృప కోసం వేలాదిమంది భక్తులు శ్రావణ సోమవారం నాడు ఆలయానికి చేరుకోవడం వేములవాడలో ఆధ్యాత్మిక

# శ్రీ రాజరాజేశ్వర నిత్యాన్నదానానికి రూ.1 లక్ష విరాళం అందజేత



వేములవాడ,(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మమత – రాజేందర్ దంపతులు వారి కుమార్తె కుమారి రష్మిక పేరున ఆలయ నిత్యాన్నదానం ట్రస్ట్ కు రూ.1 లక్ష విరాళంగా ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జి. శ్రవణ్ కుమార్ కు అందజేశారు. అన్నదానానికి విరాళం అందజేసిన దాతలకు కార్యనిర్వహణాధికారి ధన్యవాదాలు తెలియజేశారు.

# కేసీఆర్ కిట్ పథకం పునరుద్ధరించాలి

**- కేసీఆర్ కిట్ నిరుపేదలకు వరం**

**- బీఆర్ఎస్ పార్టీ యూత్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు : ఈర్లపల్లి రాజు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాల్లో ప్రసూతి అయిన నిరుపేద మహిళలకు కేసీఆర్ కిట్ పథకం ఆశీర్వాదం లాంటిదని బిఆర్ఎస్ యువజన విభాగం వేములవాడ నియోజకవర్గం అధ్యక్షులు ఈర్లపల్లి రాజు అన్నారు. సోమవారం మల్యాల గ్రామంలో బాలింతలకు కేసీఆర్ కిట్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రారంభమైన ఈ పథకం అనేక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేయడం నిరుపేదలకు పెద్ద దెబ్బ" అని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేసీఆర్ కిట్ పంపిణీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, నాయకులు పడిగల శ్రీనివాస్, నగరం శంకర్, ఎన్నం శ్రీధర్, పోతరాజు శేఖర్, మోత్కుపల్లి రాజమల్లు, బోదాసు గంగయ్య, ఐరిని రవి, శ్రావణ్, రాములు, అఖిలేష్, వెంకటేష్, రాజు, గున్ని, ప్రేమ్, సుధీర్, హేమంత్‌తో పాటు అనేక మంది బాలింతలు పాల్గొన్నారు.

# శీనన్న వసుళ్ల దందాపై
# ప్రజావాణిలో ఫిర్యాదు






**జూబ్లీహిల్స్ సర్కిల్ -18 టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇంజ శ్రీనివాస్ అక్రమ నిర్మాణాల మాటున అక్రమ వసూళ్ల దందా పైన సోమవారం నాడు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (టి జె ఎస్ ఎస్)**

**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ )** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జూబ్లీహిల్స్ సర్కిల్ -18 లో అక్రమ నిర్మాణాల మాటున జరుగుతున్న అక్రమ వసూళ్ల దందా పైన ఇప్పటికే అన్ని ఆధారాలతో సహా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, స్టేట్ విజిలెన్స్ డైరెక్టర్, ఎమ్. ఏ. యు. డి ప్రభుత్వ కార్యదర్శి ఇల్లంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్. వి.కర్ణన్, జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, అడిషనల్ సి సి పి వెంకన్న, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ జోనల్ సిటీ ప్లానర్ సాంబయ్య, ఖైరతాబాద్ జూబ్లీహిల్స్ ఉప కమిషనర్ సమ్మయ్య జిహెచ్ఎంసి లోని ఉన్నత అధికారులకి టీ జే ఎస్ ఎస్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాల దారుల రక్తాన్ని జలగలగా పిలుస్తూ అక్రమ వసూళ్ల దందాకు పాల్పడుతూ జూబ్లీహిల్స్ సర్కిల్ -18ని అక్రమ నిర్మాణాలను పుట్టగొడుగుల్లాగా పెంచి పోషిస్తూ జిహెచ్ఎంసి నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణదారులకు ప్రధాన సలహాదారుడుగా మారిన అవినీతి అధికారి జూబ్లీహిల్స్ సర్కిల్ – 18 అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసిపి) ఇంజ శ్రీనివాస్ పైన జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ప్రజావాణి లో సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. అవినీతి అధికారుల పై యుద్ధం అంటున్న తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మొదటగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇలాకాలో అక్రమ నిర్మాణాలు ఏంటి, అని ఫిర్యాదుల వెల్లువ వెదజల్లుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఇంజ శ్రీనివాస్ చేస్తున్న అన్ని అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి విజిలెన్స్ ఎంక్వయిరీ జరిపించి స్పెషల్ ఎంక్వైరీ ఆఫీసర్ ని నియమించి జూబ్లీహిల్స్ సర్కిల్ -18 లో జరుగుతున్న అన్ని అవినీతి అక్రమాలను బట్ట బయలు చేయవల సిందిగా మరోసారి విజ్ఞప్తి చేసుకుంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. జూబ్లీహిల్స్ లోనే ఇలా ఉంటే నగరంలో 30 సర్కిలలో పరిస్థితి ఇంకా ఎంత ఘోరంగా ఉంటుందో ఆలోచించాలి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ చొరవ చూపించి ఈ అవినీతి అధికారిపై విజిలెన్స్ ఎంక్వైరీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, టౌన్ ప్లానింగ్ చీఫ్ సిటీ ప్లానర్ కె శ్రీనివాస్ స్పెషల్ ఎంక్వయిరీ ఆఫీసర్ ని నియమించి జూబ్లీహిల్స్ సర్కిల్ లో జరుగుతున్న అన్ని అవినీతి అక్రమాలపై నిజా నిజాలను వెలికి తీసే విధంగా ఓ నిజాయితీగల ఆఫీసు ని ఆఫీసర్ ని నియమించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, విలేఖరులు కోరుకుంటున్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో

# ఇంటింటికీ మద్యం..

## - కేటీఆర్ సెటైర్లు



**హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ):** ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ లో సెటైర్లు వేశారు. గతంలో మేజర్ పంచాయతీలకే పరిమితమైన లిక్కర్ షాపులను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం వచ్చాక ఆదాయం కోసం వాటినే నమ్ముకుందని కేటీఆర్ మండిపడ్డారు. నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.'నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్ అంటూ ట్వీట్ చేశారు కేటీఆర్. ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897, ఇప్పుడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యంపై చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.


# రాష్ట్రంలో రవాణా ఛార్జీల మోత



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ ): : రాష్ట్రంలో వివిధ రకాల రవాణా సర్వీసు ఛార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వివరాలను అధికారిక వెబ్ సైట్ లో పెట్టారు. ఫైనాన్స్ పై వెహికల్స్ తీసుకున్న వారికి హైపొథెకేషన్ ఫీజును రూ.2,135 నుంచి రూ.3,135కు పెంచారు. లెర్నర్స్ లైసెన్సు, డ్రైవింగ్ టెస్ట్ ఫీజుల ఛార్జీలు రూ.335 నుంచి రూ.440కి పెరిగాయి. టూవీలర్, కారు లెర్నర్స్ లైసెన్స్ ఫీజు రూ.450 నుంచి రూ.585కు పెంచింది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో డ్రైవింగ్ టెస్టుకు రూ.1035 ఉండగా, ఇప్పుడు దాన్ని రూ.1135కు పెంచారు. వెహికల్ యాజమాన్య బదిలీ ఫీజు రూ.935 నుంచి రూ.1805కు హైక్ చేశారు. ఆటో రిక్షా డ్రైవింగ్ టెస్ట్ ఫీజును రూ.800 నుంచి రూ.900కి చేశారు. వాహనాల ఆర్సీల కాలపరిమితి, నేషనల్ పర్మిట్ల ఫీజుల్ని కూడా పెంచారు. మొత్తం రవాణా శాఖ మీద భారీగా ఆదాయానికి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది.

# ఏఐని లైట్ తీసుకోవద్దు

## జెఫ్రీ హింటన్ వార్నింగ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్ ):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఎన్ని లాభాలున్నాయో.. అదే స్థాయి లో నష్టాలు కూడా కలుగుతున్నాయి. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తుతున్నాయి. ఇలాంటి సిచ్యుయేషన్ లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు గాడ్ ఫాదర్ గా చెప్పుకునే జెఫ్రీ హింటన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ఏఐని లైట్ తీసుకుంటున్నారని.. దీనివల్ల కలిగే ముప్పును అంచనా వేయలేకపోతున్నారని బాంబు పేల్చారు. ముఖ్యంగా టెక్ కంపెనీలు కృత్రిమ మేధ వల్లే కలిగే ప్రమాదాలను పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ ఎక్స్ పర్ట్ అయిన జెఫ్రీ హింటన్ చాలా ఏళ్లు గూగుల్ లో సేవలందించారు. 2023లో ఆ కంపెనీ నుంచి లెఫ్ట్ అయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను విస్తృతంగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు గూగుల్ ప్రయత్నిస్తోంది.. ఇది నచ్చక హింటన్ ఆ సంస్థను వదిలేశారని అప్పట్లో వార్తలొచ్చాయి. అయితే అందులో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. కృత్రిమ మేధ వల్ల కలిగే నష్టాలను తొలినాళ్లలోనే అంచనా వేయలేకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు.

# ప్రభుత్వ కార్యాలయమా..
# ఫ్లెక్సీలకు నిలయమా.?

- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఫ్లెక్సీల జాతర
- రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు పెడితే తీసేసి ఫైన్ వేస్తారు
- జిహెచ్ఎంసి కార్యాలయంలో ఫ్లెక్సీలను తొలగించరా
- కార్యాలయం చుట్టూ ఫ్లెక్సీ లేనా పచ్చదనం ఉండదా
- ఫ్లెక్సీల ఏర్పాటుతో పొల్యూషన్ ప్రమాదమున్న పట్టించుకోని అధికారులు, పాలకులు
- రాజకీయ నాయకులకు ఓ లెక్క, జిహెచ్ఎంసి యూనియన్ నాయకులకు ఓ లెక్కన
- మీ కార్యాలయంలోని ఫ్లెక్సీల కు ఎంత ఫైన్ వేశారు కమిషనర్ కర్ణన్ సాబ్

**( ఆర్ కె - ప్రశ్న న్యూస్ బ్యూరో)**










రాజకీయ నాయకుల సమావేశాలకు, పుట్టినరోజులకు, పండుగలకు, పబ్బాలకు, పాలాభిషేకాలకు ఇలా ఏది పడితే అలా సందర్భం వచ్చిందో చాలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం ఒక వ్యసనంగా మారింది. వాళ్ల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటేనే లీడర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు అని ప్రజలు గుర్తిస్తారో.. లేదో.. అన్న అభద్రత భావం, అప నమ్మకంతో కొంతమంది ఇలా ఫ్లెక్సీల పిచ్చిలో మునిగిపోయారు. ఈ ఫ్లెక్సీల ఏర్పాటుతో పొల్యూషన్ తీవ్రస్థాయికి చేరుతుందని గత ప్రభుత్వంలో నిషేధం విధించారు అయిన అమలు చేసే అధికారులు లేరు పట్టించుకునే ప్రజా ప్రతినిధి లేడు. ఫ్లెక్సీలు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై గల్లీలో రాజకీయ నాయకుల ఇంటిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జిహెచ్ఎంసి అధికారులు కొన్ని ఫ్లెక్సీలకు ఫైన్ వేస్తారు వెంటనే తొలగిస్తారు, అంతర్గత ఒప్పందాలు ఉంటే అసలు తొలగించరు నెలలకొద్దీ అలా ఉండిపోతాయి. మరి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం లో ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అసలు ఇది మున్సిపల్ కార్యాలయమే అందుకోసమే ఇలా ఉంది అన్నట్లుగా తయారు చేశారు. కార్యాలయంలో లోపల కార్పొరేట్ స్టైల్ బయట చూస్తే ఫ్లెక్సీలతో మున్సిపల్ స్టైల్ అన్నట్లు పోటీపడి యూనియన్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఒక్క రోజుతో ఫ్లెక్సీలను తొలగించాల్సిన అధికారులు సిబ్బంది సంవత్సరం కొద్ది నిత్యం వాటిని చూస్తూ సంతోషిస్తున్నారు. బయట చూస్తేనేమో తొలగిస్తారు కార్యాలయంలో తొలగించాలన్న చిత్తశుద్ధి లేకపోవడం చూస్తుంటే వాళ్ళ బాధ్యతారాహిత్యం ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అనుమతులు తీసుకొని ఏర్పాటు చేశారా లేక అనుమతులకు విరుద్ధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు ఒక రూల్ ప్రభుత్వ సిబ్బందికి ఒక రూల్ ఉందా.? జిహెచ్ఎంసి నియమ నిబంధనలలో మున్సిపల్ శాఖ మంత్రి, కమిషనర్ తెలపాలి. గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు ఇక్కడికి వస్తు పోతూ ఉంటారు, మరి ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, జిహెచ్ఎంసి కమిషనర్, అదనపు కమిషనర్లు, మంత్రులు, గ్రేటర్ హైదరాబాద్ సర్కిల్లో ఉండే ప్రజా ప్రతినిధులు,జోనల్ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ విభాగాలకు సంబంధించిన ఉన్నత అధికారులు నిత్యం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కి వస్తూ ఉంటారు. ఒక్కరికి కూడా ఈ ఫ్లెక్సీలను చూస్తే ఇంత అద్వాన్నంగా ఇలా ఏర్పాటు చేశారు తొలగించండి అని ఒక్క పదం కూడా వాళ్ల దృష్టికి రాలేదు అంటే వీళ్ళ పాలన ఎంత అధ్వానంగా ఉందో అని ప్రజలు బాహటంగా చర్చించుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రాజకీయ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే జిహెచ్ఎంసి అధికారులు తొలగించి వాటికి ఫైన్లు వేస్తారే మరి గ్రేటర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లకు నిబంధనలు వర్తించవా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ఫ్లెక్సీలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేస్తే ఒక్క అధికారి, సిబ్బంది తొలగించడానికి సాహసించరు అదే ప్రతిపక్షంలో ఉన్న వాళ్ళది వేసిన గంటలలోనే తొలగిస్తారు మొన్న మాజీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బర్త్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. అదే అధికార కాంగ్రెస్ పార్టీ, బిజెపి పార్టీ సంబంధించిన ఫ్లెక్సీలు ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారు వాటిని తొలగించడం లేదు, కనీసం ఫైన్ కూడా వేయరు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్న జిహెచ్ఎంసి అధికారులు పట్టించుకోరు ఇలా ఉంది పాలన అని ప్రజలు మండిపడుతున్నారు. తక్షణమే గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ స్పందించి జిహెచ్ఎంసి సర్కిల్ లలో, జోనల్ కార్యాలయాలలో, జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు. మరి కమిషనర్ కర్ణన్ దీనిపై ఎలా స్పందిస్తారో పర్యావరణాన్ని బాగు చేయాలని ఫ్లెక్సీల పై కఠినంగా వ్యవహరిస్తారో లేక ఏది ఎలా పోతే నాకేంటి అని గాలికి వదిలేస్తారో వేచి చూడాలి.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588